# “దూర దేశములోనికి”

## (1 సమూ. 27-2 సమూ. 2)

లోకానికంతా బాగుగా తెలిసిన చిన్న కథ ఈ క్రింది మాటలతో ఆరంభమౌతుంది:

> ఒక మనుషినికి ఇద్దరు కుమారులుండిరి. వారిలో చిన్నవాడు – తండ్రీ, ఆస్తిలో నాకువచ్చు భాగమిమ్మని తన తండ్రినడుగగా, అతడు వారికి తన ఆస్తిని పంచిపెట్టెను. కొన్ని దినములైన తరువాత ఆ చిన్న కుమారుడు సమస్తమును కూర్చుకొని దూర దేశమునకు ప్రయాణమై పోయి, అచ్చట తన ఆస్తిని దుర్వ్యాపారమువలన పాడుచేసెను. అదంతయు ఖర్చు చేసిన తరువాత ఆ దేశమందు గొప్ప కరవు రాగా వాడు ఇబ్బందిపడసాగి, వెళ్లి ఆ దేశస్థులలో ఒకనిచెంత జేరెను. అతడు పందులను మేపుటకు తన పొలములోనికి వానిని పంపెను. వాడు పందులు తిను పొట్టుతో తన కడుపు నింపుకొన ఆశపడెను గాని యెవడును వాని కేమియు ఇయ్యలేదు (లూకా 15:11–16).

ఆ చిన్నవాడు తన యింటిని ఎందుకు వదలాడు? తన తండ్రిచేత విధింపబడిన హద్దులు అతనికి యిష్టం లేకపోయినై ఏమో. పని, బాధ్యతలు అనే వాటిచేత అలసి పోయాడేమో. లోకాన్ని చూడాలనుకొన్నాడేమో. కారణమేమైయున్నా, అతడు దూర దేశానికి ప్రయాణమైపోయాడు, దానికి కలిగిన ఫలితం ఘోరమైనదే.

చాలా కాలం ఎరిగిన ఈ కథను గూర్చి నేను ఆలోచించేటప్పుడు, తప్పిపోయిన కుమారుని నిదర్శనంగా తీసుకున్న వేలాదిమందిని గూర్చి చింతిస్తూ ఉంటాను. భక్తిగల తల్లిదండ్రులు పెంచినా, జీవితంలో ఏదో పోగొట్టుకున్నట్టు భావించి, పాపపు దూర దేశంలోనికి వెళ్లిన యువకులగు స్త్రీ, పురుషులను గూర్చి నేను ఆలోచన చేస్తూ ఉంటాను. తమను తమ కుటుంబాలు చాలా హద్దులో పెడుతున్నాయని తలచే వేలకొలది మంది యువకులు ప్రతి సంవత్సరం, తమ తలిదండ్రుల హృదయాలను భగ్నం చేస్తూ ఇంటినుండి పారిపోతున్నారు. జీవితంలోని వేదనను సారాయితోను, డ్రగ్స్‌తోను తప్పించు కోవచ్చుననుకొనే వారిని గూర్చి నేను ఆలోచిస్తూ ఉంటాను.

అలాటి దూర దేశానికి వెళ్లేది కేవలం యువకులు మాత్రమే కాదు. వివాహం అనే వలలో పడ్డామని భావించే భార్యా భర్తలు, తమ జంటను విడిచి జీవితాలను పాడుచేసికున్న వారున్నారు. తల్లులు, తండ్రులు బాధ్యతలతో విసిగి తమ కుటుంబాలను విడిచిపోయినవారున్నారు. “ఒక ఉదయానలేచి తమ జీవితంలో ఉన్న సరదా అంతా పోయిందని” తలచిన క్రైస్తవులు, లౌకిక జీవిత విధానాన్ని కౌగలించుకుని దిగ్భ్రమ కలిగించారు. వారి భక్తిహీనత బయటపడినప్పుడు, సువార్తికులు, పెద్దలు, పరిచారకులు సంఘాన్ని అపకీర్తిపాలు చేశారు.

మనలో ఎవరునూ మినహాయింపబడలేదు (ఏదో యొక “దుస్థితి”కి లోబడే అవకాశం మనకు కూడా ఉంది). క్రీస్తు శరీరమందలి అవయవములుగా, మేలు చేయుటలో మనం “విసిగిపోవచ్చు” (గలతీ. 6:9), అలా నిశ్చేతమైన దూర దేశానికి మనం చేరి ఉండవచ్చు.

దూర దేశం వెళ్లి తనకు కలిగియున్నవన్నియు వ్యర్థం చేసినవాడు తప్పిపోయిన కుమారుడొక్కడే కాదు. లేక వాటి ఫలితాలను కోసిన మొదటివాడు కడపటివాడు అతడొక్కడే కాదు.

తప్పిపోయిన కుమారుని కథను నేను ఆలోచిస్తూ ఉండగా, దావీదు బహు వింతైన, ప్రకృతి విరుద్ధమైన జీవిత కాలాన్ని కూడా నేను ఆలోచిస్తాను: పదహారు నెలలు అతడు ఫిలిష్తీయాలో నివసించాడు. గత సంచికలో, 1 సమూ. 26, దావీదు సౌలును రెండవసారి విడిచిపెట్టిన విషయాన్ని గూర్చి చదివాం. అధ్యాయం 27 యిలా ఆరంభమౌతుంది,

> తరువాత దావీదు – నేను ఇక్కడ నిలుచుట మంచిది కాదు, ఏదో ఒక దినమున నేను సౌలుచేత నాశనమగుదును; నేను ఫిలిష్తీయుల దేశములోనికి తప్పించుకొని పోవుదును. అప్పుడు సౌలు ఇశ్రాయేలీయుల సరిహద్దులలో నన్ను వెదకుట మానుకొనును గనుక నేను అతని చేతిలోనుండి తప్పించుకొందునని అనుకొని లేచి తన యొద్దనున్న ఆరువందలమందితో కూడ ప్రయాణమై మాయోకు కుమారుడును గాతు రాజునైన ఆకీషునొద్దకు వచ్చెను. దావీదు గాతులో ఆకీషునొద్ద చేరగా అతడును అతని వారందరును తమ తమ కుటుంబముల సమేతముగా కాపురముండిరి … (1–3 వచనాలు).

పరుగెత్తడానికి దావీదు మొదట ఆరంభించినప్పుడు, గాతు రాజైన ఆకీషువద్ద ఆశ్రయం కోరాడు. పిచ్చివాడుగా నటించి, తన ప్రాణాన్ని కొద్దిలో తప్పించుకున్నాడు (1 సమూ. 21:10–15). ఇప్పటికి దాదాపు తొమ్మిది సంవత్సరాలు గడిచిపోయాయి, పరిస్థితుల్లో మార్పు వచ్చింది. సౌలు దావీదును ద్వేషిస్తున్నది అందరికి తెలిసినదే. దావీదు కొద్దిపాటి సైన్యాన్ని తెచ్చి ఆకీషు స్వాధీనంలో ఉంచాడు కూడా. గాతులో ఈసారి దావీదు వ్యత్యాసమైన ఆహ్వానాన్ని పొందాడు, దానితో అతడును అతని జనులును తమ కుటుంబాలతో గాతులో స్థిరపడ్డారు, ఫిలిష్తీయాను తమకు నివాసంగా చేసికున్నారు. "దావీదు ఫిలిష్తీయుల దేశములో కాపురముండిన కాలమంత ఒక సంవత్సరము నాలుగు నెలలు" (27:7).[1]

ఇది ఎంత పొందికలేనిదో మనం అభినందించడానికి గాను, ఇంతకు ఫిలిష్తీయులెవరు? దేవుని ప్రజలకు వారు ఎలాటి గర్భ శత్రువులు అనే విషయాలను మనం అర్థం చేసికోవాలి.[2] వారు మధ్యధరా సముద్ర తీరాన కనాను దేశానికి నైరుతి దిశగా నివసించేవారు ( పటం చూడు). వారు దాగోను[3] (సగం మనిషి, సగం చేప) అష్టారోతు దేవతలనబడిన వాటిని పూజించే విగ్రహారాధకులు.[4] ఫిలిష్తీయుల దేశము చిన్నదైయున్నా,[5] నేర్పుగా ఏర్పరచిన వారి వ్యాపార కేంద్రాలు, బలవంతులును, ఖ్యాతిగలవారునైన జనులకు స్థావరమిచ్చాయి.[6]

యెహోషువా ఇశ్రాయేలీయులను కనానుకు నడిపించినప్పుడు, ఫిలిష్తీయుల గొప్ప పట్టణాలను వారు స్వాధీనం చేసికోలేకపోయారు.[7] అల్లకల్లోలంగా ఉన్న న్యాయాధిపతుల కాలంలో, ఇశ్రాయేలీయుల దక్షిణ ప్రాంతాన్ని ఫిలిష్తీయులు మాటి మాటికి పట్టుకొన్నారు.[8] ఒకసారి మాత్రం వారు నలభై సంవత్సరాలు ఇశ్రాయేలీయులను స్వాధీనపరచుకున్నారు.[9] ఫిలిష్తీయుల శీలాన్ని గూర్చి కొంత అర్థం చేసికోవాలంటే, ఫిలిష్తీయుల సుందరియగు

డెలీలాను,[10] సంసోను తన బలాన్ని కోల్పోయిన తరువాత అతనిపై జరిపిన అమానుషపు చర్యలను గుర్తు చేసుకోవాలి.

సమూయేలు కాలంలో, దేవుని జనులపై ఫిలిష్తీయులు గొప్ప విజయాన్ని సాధించి, ఇశ్రాయేలీయుల మతంలోని పవిత్ర చిహ్నమైన మందసాన్ని పట్టుకున్నారు. ఆ మందసాన్ని అష్డోదుకు కొనిపోయి దాగోను ఆలయంలో అపహాస్యనికై ఉంచారు.[11] సౌలు సింహాసనానికి వచ్చిన తరువాత, గిబియాలో అంటే యూదాయొక్క మధ్య భాగంలో[12] తమ సైన్య శిబిరాలను ఉంచుకొని, అక్కడనుండి ఇశ్రాయేలీయులతో అన్ని దిశలకు దండయాత్రలు చేశారు.[13] మన పఠనంలో, ఫిలిష్తీయులతో ఏర్పడిన అనేక సంఘర్షణలలో కొన్నింటిని మనం గుర్తించాం. ఈ పఠనం ముగించేలోపు యింకా కొన్నింటిని చూద్దాం.

ఫిలిష్తీయులు తమ యిష్టాన్ని సాధించుకో గలిగినట్లయితే, దేవుడు ఎన్నుకున్న ప్రజలు నిర్మూలం చేయబడేవారే, దేవుడైన యెహోవా నామం ఉచ్చరింపబడకపోయేదే. దావీదు వెళ్లి, యథార్థ దైవాన్ని పూజింపని, భక్తిహీనులై విగ్రహ పూజలు చేసే జనుల మధ్య నివసించడానికి వెళ్లాడని ఆలోచిస్తుంటేనే మనస్సు తడబడుతుంది. అయినా, అతడు చేసిన పని అదే. ప్రభువు తప్పిపోయిన కుమారుని కథ చెప్పడానికి వెయ్యి సంవత్సరాల ముందు, దావీదు "దూర దేశము ప్రయాణమైపోయాడు" –దూరం భౌగోళికంగా కాదు, నైతికంగా, ఆత్మ సంబంధంగా, దైవికంగా. అలాగే మనం కొన్ని సార్లు, "ఏమి బోధింపబడ్డామో దానికి దూరంగాను," మనం ఏది విశ్వసించామో దానికి దూరంగాను, మన గత జీవిత విధానానికి దూరంగాను పయనిస్తాం.

ఈ పాఠంలో మూడు ప్రశ్నలు అడుగగోరతాను: (1) దావీదు దానిని ఎందుకు చేశాడు? (2) దానివలన వచ్చిన ఫలితాలేమి? (3) దావీదు ఎలా తిరిగి రాగలిగాడు? మనం దూర దేశం ఎందుకు వెళ్లతామో – తిరిగి ఏ విధంగా రాగలమో అనేదాన్ని గూర్చి కొంత గ్రహింపును మనం పొందగలం.

## వెళ్లడానికి కారణాలు (1 సమూ. 27:1-3)

మనం అడుగవలసిన మొదటి ప్రశ్న ఏమంటే – ఫిలిష్తీయులతో నివసించడానికి దావీదు ఎందుకు వెళ్లాడు? విదితమైన జవాబేమంటే – సౌలు బారినుండి తప్పించుకోడానికి (27:1).[14] ఆ దృష్టిలోనుండి చూస్తే, దావీదుయొక్క తీర్మానంలో కొంత లౌకిక యుక్తి ఉన్నట్టు కన్పిస్తుంది. దావీదు సౌలు బారినుండి తప్పించుకున్నది వాస్తవం (27:4) సంవత్సరాలలో తొలిసారిగా, తాను, తన కుటుంబము నిరంతరము కదులుతూ ఉండడం మాని, సాధారణమైన జీవితాన్ని గడపడానికి వీలుకలుగుతుంది.

ఏదియెలాగున్నా, 27:1 మీద ఒక వ్యాఖ్యాన కర్త యిలా అన్నాడు, "అతని విశ్వాసంలోను, భావనలలోను ఉన్న సంకోచము ఇశ్రాయేలీయుల సరిహద్దులకు వెలుపల ఆశ్రయాన్ని కోరింది."[15] "దావీదు విశ్వాసంలో సంకోశముందా"? ఈ సందర్భాన్ని ఎంత ఎక్కువగా చదివితే, ఆ కామెంట్ నిజమని అంత ఎక్కువగా నేను ఒప్పుకున్నాను. ఈ (దిగువ) వాస్తవాలను ఆలోచించు: దావీదు తరువాత రాజు అవబోతాడని దేవుడు

వాగ్దానం చేశాడు. దేవుడు తనతో ఉంటానని వాగ్దానం చేశాడు. యోనాతాను, సౌలు, అబీగయీలులు దావీదు రాజు కాబోతాడని నమ్మారు. సౌలు దావీదును దాదాపు తొమ్మిది సంవత్సరాలు తరిమినా, "దేవుడు అతనిని సౌలు చేతికి అప్పగించలేదు" (1 సమూ. 23:14).

దావీదుకు ఇది అంతా తెలుసు. తన జీవితంలో జరిగిన దానినంతటికి దేవుని హస్తము ఉన్నట్టు అతడు తరచుగా సూచించాడు. అతడు సౌలు చేతిలో నశించిపోడు అనడానికి యింకా ఏమి రుజువు కావాలి (27:1)?

విరామంలేని ఒక రాత్రి తరువాత, మేఘ పూరితమైన చీకటిగానున్న ఒక ఉదయ కాలమున దావీదు మేల్కొన్నాడని అనుకో. ఉదయ కాల భోజనం-చల్లని రొట్టె, మేక జున్నుపెట్టి ఉండగా వాటి ముందు కూర్చుండి, తన విడిది చిందర వందరగా ఉండగా, అలసిపోయినట్టున్న తన భార్యల ముఖాలను చూచి, "ఏ సమయంలోనైనా సౌలు సైన్యం మనమీద పడవచ్చు. జీవించే విధానం యిది కాదు. నేను చనిపోయేవరకు సౌలు విశ్రమించడు" అని ఆలోచించాడు. పశ్చిమ దిశవైపు చూచి నిట్టూర్పు విడిచాడు. "మనకు గత్యంతరం లేదు. మనం ఈ దేశం విడిచి వెళ్లిపోవలసిందే." వయసుకుముందే ముసలితనం వచ్చిన మనిషిలా నెమ్మదిగా లేచి, తన శిబిరము కదలిపోవాలని ఆజ్ఞ యిచ్చినట్టు నేను ఊహిస్తున్నాను.

> తరువాత దావీదు - నేను ఇక్కడ నిలుచుట మంచిది కాదు, ఏదో ఒక దినమున నేను సౌలుచేత నాశనమగుదును; నేను ఫిలిష్తీయుల దేశములోనికి తప్పించుకొని పోవుదును, అప్పుడు సౌలు ఇశ్రాయేలీయుల సరిహద్దులలో నన్ను వెదకుట మానుకొనును గనుక నేను అతని చేతిలోనుండి తప్పించుకొందునని అనుకొని ... (27:1, 2).

"దావీదు తనకు తాను ఏమి చెప్పుకున్నాడో" గుర్తించు. దావీదు దేవుని చిత్తం కొరకు విచారణ చేయలేదు; దావీదు తనకు తానే మాట్లాడుకున్నాడు. తరువాత, దావీదు యొక్క ఆలోచనలు తనమీదనే ఉన్నట్టు గమనించు: "ఇప్పుడు నేను సౌలు చేతిలో ఒకనాడు నాశనమౌతాను. ఫిలిష్తీయుల దేశంలోనికి పారిపోవుటకంటె నాకు శ్రేష్ఠమైనది లేదు. నా కొరకు ఇశ్రాయేలు దేశమంతటియందు వెదకడంలో వేసారిపోతాడు, నేను అతని చేతిలోనుండి తప్పించుకొంటాను." నీ ఆలోచనలన్నీ నీ చుట్టే కేంద్రీకృతమై, ప్రభువు పనికి ఏది శ్రేష్ఠమైనదో అనే దానికంటే, నీకు ఏది శ్రేష్ఠమైనదో దానిని గూర్చియు నీవు అక్కర చూపినట్లయితే, రెండు విషయాలు ప్రతిఫలంగా వస్తాయి: నీవు నీ విశ్వాసంలో లోపం కలిగి ఉంటావు, దూర దేశం వెళ్లడం ఆకర్షణీయంగా ఉంటుంది.

దూర దేశం ప్రయాణమై పోవడంలో విశ్వాస సమస్య ఉంటుంది - తల్లిదండ్రులలో విశ్వాసం లేకపోవడమో, వివాహంలో విశ్వాసం లేకపోవడమో, మనం నిర్వహించే జనులయందు విశ్వాసం లేకపోవడమో, మన మీద మనకే విశ్వాసం లేకపోవడమో జరుగుతుంది. ఏదియెలాగున్నా, దీనంతటి వెనుక - దేవునియందు విశ్వాసం లేకపోవడం - ఆయన వాక్యమందు బయలుపరచబడిన ఏర్పాట్లయందును, ఆయన

కరుణాహస్తపు కాపుదలయందు విశ్వాసం లేకపోవడం హేతువై ఉంటుంది.

## మానసిక బాధనుండి విముక్తి (1 సమూ. 27:4)

ఫిలిష్తీయాకు దావీదు కదలిపోవడంలోని ప్రాథమిక కారణం విశ్వాస లోపమేనని నొక్కి చెప్పిన తరువాత, నా పాయింటు నిన్ను అబ్బురపెట్టవచ్చు: దావీదు నిర్ణయానికి వెనువెంటవచ్చిన ప్రతిఫలం, తాను తీవ్రంగా కోరిన మానసిక బాధనుండి విముక్తి. 27:4లో మనం యిలా చదువుతాం: "దావీదు గాతునకు పారిపోయిన సంగతి సౌలునకు తెలిసిన మీదట అతడు దావీదును వెదకుట మానివేసెను." దావీదు నడిచే ప్రతి కదలికయు అతడు తన భుజాలకు పైగా చూడనవసరం లేదు. నాగరికులైన జనులుగా తానును తన కుటుంబమును ఒక యింట నివసింపవచ్చు. రాత్రిలో తనపైబడి, తన గొంతు కోస్తారనే బెదురు లేకుండా అతడు నిద్రపోవచ్చు.

దూర దేశానికి వెళ్లడంలో ఉన్న ఒక ఆకర్షణీయమైన సంగతి అది: తప్పుని సరియైన పరిస్థితి అని మనం ఆలోచించిన వెంటనే వచ్చే ఫలితమే యిది. తప్పిపోయిన కుమారుడు దూర దేశం ప్రయాణమై పోయినప్పుడు, అతడు ఎవరికిని లెక్క చెప్పవలసిన అవసరతలో లేడు, అతడు ఎవనిని డబ్బు అడుగవలసిన అవసరం కూడా లేదు; అతనికి బాధ్యతలే లేవు. ఒకడు వివాహమందు బంధించబడి, దానిని విడిచిపెట్టాడంటే, గొప్ప విముక్తి పొందిన అనుభూతి వానికి కలుగుతుంది. తండ్రి లేక తల్లి బాధ్యత ఒత్తిడిగా నున్నప్పుడు, ఆ బాధ్యతను తాను వైదొలగించుకొన్నానన్న వెంటనే తన మనస్సులోనికి విముక్తి ప్రవహిస్తుంది. ఒకడు జీవన సంఘర్షణలో మునిగిపోయి, డ్రగ్స్, సారాయి లోకంలోనికి వెళ్లిపోయాడంటే–క్షణికంగా ఆ బాధ తొలిగిపోతుంది – అది అద్భుతంగా కనిపిస్తుంది. ప్రభువును సేవించడంలో వేసారిపోయినవాడు, "నా క్లాసు టీచ్ చేయడానికి ఎవనినైనా తెచ్చుకోండి! నేను మానివేస్తున్నా!" అని ఒకడు ప్రకటించినప్పుడు, విముక్తి పొందిన్నట్టున్న అతని భావన అధికమై ఉండవచ్చు.

జనులు దూరదేశం వెళ్లి విముక్తి పొందాలని నేను సిఫారసు చేస్తున్నానా? లేదు. నేను నిష్కపటంగా ఉండ ప్రయత్నిస్తున్నాను. "అల్పకాలము పాపభోగము" అనే విషయాన్ని గూర్చి హెబ్రీ రచయిత మాట్లాడాడు (హెబ్రీ. 11:25). ఆలాటి పాపము ఆకర్షణీయంగా ఉంటుందని మనం అంగీకరింపవచ్చు. "పాప భోగాలు" కొన్ని సార్లు అంతరంగానికి సంబంధించినవిగానే ఉంటాయి గాని, భౌతికమైనవిగా ఉండవు. కొన్ని సార్లు అవి ఆత్మను నిద్ర పుచ్చినంతగా శరీరాన్ని తృప్తిపరచవు.

ఈలాటి విశ్రాంతిని లేక విముక్తిని కోరడంలో ఉన్న సమస్య రెండు రకాలు: మొదటగా, దేవునికి అవిధేయులైనందువలన పొందే విశ్రాంతి తాత్కాలికమైనదే. పాప భోగాన్ని గూర్చి హెబ్రీ రచయిత మాట్లాడినప్పుడు, "అల్పకాలము పాపభోగమని" అతడు పిలిచాడు. KJV అవి ఒక్క కాలానికి మాత్రమే ఉంటాయి అది "గతించి పోయే సంతోషం." అందువలన నేనేమి చెప్పుతున్నానంటే, "దావీదు నిర్ణయానికి వెనువెంట వచ్చేది తాత్కాలికమైన విముక్తి."

రెండవది, దేవునికి విధేయత చూపుటలో అయ్యే ఖర్చువలన సంపాదించే విముక్తి పొందినప్పుడు, తన విముక్తికి అతడు ఎక్కువ రుసుము చెల్లిస్తాడు. నేలమీద నిలిచినవాడు దాని స్పష్టమైన ఫోటోను తీసికొనేటట్టు చెట్టు మీదనున్న మనిషి అడివి పిల్లిని తన చేతితో పట్టుకోవాలి అనే మనిషి యొక్క జెర్రీ క్లోవర్ కథను గూర్చి నీవు వినియుండవచ్చు. చివరిగా చెట్టుమీద నున్నవాడు: "మా యిరువురిలో ఒకరు కొంత రిలీఫ్ (విముక్తి) పొందేలా తొందరగా కొట్టు" అని తన స్నేహితునితో బిగ్గరగా అన్నాడట. జెర్రీ దీన్ని చెప్పేటప్పుడు హాస్యాస్పదంగా ఉంటుంది. "అడవి పిల్లిని తోకతో పట్టుకొన్నవాని" ఇబ్బందిని మనం దయగా ఆలోచిస్తాం. విముక్తి కొరకు ఆ మనిషి మహా ఎక్కువైన రుసుము చెల్లించవలసియుంది.

భరించలేని ఇలాంటి పరిస్థితిలో కొంత ఉపశమనం కలగడానికి నీవు కూడా ఉండవచ్చు. "కొంత ఉపశమనం కలగడానికి నేను దేన్నైనా ఇచ్చేస్తాను" అని నీవు చింతించవచ్చు. జాగ్రత్త. ఉపశమనం కోసం చాలా ఇవ్వవలసి ఉంటుంది.

## వెళ్లిన దానిలోని సాధక బాధలు (1 సమూ. 27:5-30:6)

దావీదు వెనువెంటనే తీసుకున్న నిర్ణయం అతనికి తాత్కాలికమైన విశ్రాంతినిచ్చింది. ఇప్పుడు మనం దీర్ఘకాలిక ఫలితాలను చూద్దాం.

### తన స్వాతంత్ర్యాన్ని, దాస్యానికి మార్పిడి చేశాడు

దావీదు ఫిలిష్తీయాకు రాకముందు స్వతంత్రుడు. అది ఒత్తిడితో కూడిన స్వాతంత్ర్యమనుకో, అయినా అది స్వతంత్ర్యమే. ఇప్పుడు, శరణాలయానికి మార్పిడి చేయబడినప్పుడు, గాతు రాజైన ఆకీషుకు తన స్వాతంత్ర్యాన్ని కుదువ పెట్టాడు. 27:5లో దావీదు ఆకీషు యొక్క "దాసుడు"[16] అని తన్ను తాను పిలుచుకున్నాడు. దావీదు గాతు పట్టణంనుండి వెళ్లిన తరువాత కూడా, తన కార్యకలాపాలను గూర్చి అతడు ఆకీషుకు రిపోర్టు చేయవలసి వచ్చినట్టు 9, 10 వచనాలు సూచిస్తున్నాయి.[17] దావీదు అనుభవించిన స్వాతంత్ర్యానికి, ఆకీషుకు అతడు కనపరచే విధేయతను బట్టి అతని మనస్సు నొచ్చుకొని ఉండాలి.

లోకంలోవలె జీవించాలని ఒక యువకుడు యింటిని విడిచినప్పుడు, "నేను స్వతంత్రుడనై ఉండాలి" అని మాట్లాడతాడు! సారాయితో, చట్ట విరుద్ధమైన డ్రగ్స్‌తోను ఒక వ్యక్తి తన పరిశోధనను ఆరంభించినప్పుడు, "నేనేమి చేయాలో నీవు చెప్ప వీలుపడదు; నేను స్వతంత్రుడను" అని మనం తెలిసికోవాలని అతడు కోరతాడు. వివాహపు బాధ్యతనుండి వైదొలగాలని, లేక తల్లిదండ్రుల బాధ్యతలను తొలగించుకొని వెలుపలికి వచ్చి, "స్వేచ్ఛగా ఉండాలని నా ప్రాణం కోరుతుంది!" అని అతడు లేక ఆమె కేకలు వేయవచ్చు. ఈలాటి జనులు గ్రహించలేనిది ఏమంటే స్వాతత్ర్యంలోని ప్రయోజనకరమైన కట్టుబాటులు, పాపంతోకూడిన నియంతృత్వపు బానిసత్వానికి మార్పిడి చేస్తున్నారు. (యోహాను 8:34; రోమా 6:16). స్వాతంత్ర్యాన్ని కోరి తప్పిపోయిన కుమారుడు

దూరదేశము వెళ్లియుండవచ్చు, “కడకు అతడు ఆ దేశంలోని ఒక పౌరునికి” దాస్యం చేయడంలో తనకు తాను పట్టుపడ్డాడు (లూకా 15:15).

### దేవునితో ఉన్న సన్నిహితత్వాన్ని రాజీపడడానికి మార్పిడి చేసికొన్నాడు

ఫిలిష్తీయాలో ఉండగా, దేవునితో దావీదుకున్న బాంధవ్యం క్షీణించిపోయింది. ఒక సంవత్సరానికి పైగా దావీదు దేవుని వద్ద విచారణ చేసినట్టు ప్రస్తావన లేదు. ఫిలిష్తీయుల మధ్య అతడు నివసించినప్పటికి కీర్తనలు లేనట్టున్నాయి. దావీదు పాడటం నిలిపివేశాడు. ఇది వింతకాదు. దేవుని ఆరాధనను వ్యతిరేకించే వారి మధ్య బహిరంగంగా ఆరాధించేది ఎలా? ఆ పదింటిని అతిక్రమించే వారి మధ్య ఆ పది ఆజ్ఞల ప్రకారం ఒకడు ఎలా జీవించగలడు?

లోకంవలె జీవించడానికి నీవు తీర్మానించుకున్నట్టయితే, దేవునితో నీ బాంధవ్యాన్ని అది తెంచివేస్తుంది (1 యోహాను 2:15). ఆర్థికమైన విజయ సాధనయే నీ జీవితానికి అతి ప్రాముఖ్యమైనదని నీవు తీర్మానించుకుంటే, దేవునితో నీకున్న బాంధవ్యాన్ని అది తెంచివేస్తుంది (మత్తయి 6:24). అవిశ్వాసులతో నీవు భుజాలు రుద్దుకుంటూ తిరుగుతూ, విశ్వాసులతో అరుదుగా కలిసియుండడమైతే, దేవునితో నీకున్న బాంధవ్యాన్ని అది పాడుచేస్తుంది (1 కొరింథీ. 15:33). ఇందులో ఏ వింతా లేదు. లోకంతోపాటు నీవు పోవాలంటే, లోకంలాగా నీవు మాట్లాడాలి, లోకంలా నీవు ప్రవర్తించాలి, అది యోచించినట్టే నీవు కూడా ఆలోచిస్తావని దాన్ని నమ్మించాలి. నిన్ను నీవు దానికి అనుకూలంగా ఒంచుకోవాలి. దానికి ప్రతిఫలం దేవుని బిడ్డగా కన్పించడంలో మెల్ల మెల్లగా తగ్గిపోతావు, లోకస్థునిలా ఎక్కువగా కన్పిస్తావు. దూర దేశంలోనికి పోవడంలో ఒకడు చెల్లించవలసిన రుసుము యిది.

హాబీగా గారడీని[18] నేను యిష్టపడతాను. పెద్దవాడనైన తరువాత నేను గారడీ ప్రొఫెషనల్ కావాలని నా లేత వయస్సులో తలంచేవాడిని. ఈ విషయం నా తల్లికి చెప్పినప్పుడు ఆమె కొంతసేపు ఆలోచించి “అయితే నీవు ఎక్కడ దాన్ని ప్రదర్శిస్తావు?” అన్న ప్రశ్నతో నన్ను ఆపివేసింది. ఆ దినాల్లో, మెజీషియన్‌గా బాగా సంపాదించగోరితే, నైట్ క్లబ్స్‌లో వాటిని పెర్‌ఫార్మ్ చేసేవారు. “నీ కలలను పండించుకొనడానికి గాను దూర దేశం వెళ్లడానికి నీవు ఇష్టపడతావా?” అని నా తల్లి అడుగుతుంది. నిర్ణయాలు తీసికోడం నేను బాగా నేర్చుకున్నాను–నేను నా ఆలోచనలను మార్చుకున్నాను. వినోదాలతో మనుష్యులకు ఉల్లాసం కలిగించే అవకాశాలు ఎక్కువగా తెరుచుకున్నాయి, కాని ఎంటర్‌టెయిన్‌మెంట్ ఫీల్డ్ ప్రయాణమైపోయే దూర దేశంలో విశ్వాసాన్ని కోల్పోవడం సత్యం, అందులో దూరదేశంలోనికి వెళ్లిన ప్రతి విశ్వాసియైన దేవుని బిడ్డ విశ్వాసాన్ని కాపాడుకున్నాడు అని అంటే, అలా కాపాడుకోని ఒక డజన్ మంది పేర్లను నేను చెప్పగలను.

తాను ఎన్నుకునే వృత్తిని గూర్చి నేనెవనికిని ఉత్తరువు జారీచేయ ప్రయత్నించడం లేదు, కాని అది ఏ వృత్తియైనా సరే, నీవు ఎవరితో కలిసి ఉంటావు, వారికుండే జీవిత ప్రమాణాలు, నీవు వారి చేత అంగీకరించబడాలంటే కోరబడే నీ ప్రవర్తన అనేవాటిని

గూర్చి ఆలోచించుమని నేను నిన్ను అర్థిస్తున్నాను. నీవు నీ నిర్ణయం చేసిన తరువాత, ప్రార్థించడం తక్కువగా, దేవునికి స్తుతిగానం చేయడం తక్కువగా, దగ్గరనున్న ద్వారం దగ్గరకు నడవడం కాక, పరుగెత్తడం జరుగుతూ ఉంటే నీ వృత్తిని గూర్చి ఆలోచన చేయాలని నేను అడుగుతున్నాను. దేవునితో నీకున్న బాంధవ్యం పూర్ణంగా లయపరచబడక ముందే దాన్ని వదలుకో!

## నిష్కాపట్యాన్ని మోసపు బ్రతుకుకు మార్పిడి చేసాడు

సౌలునుండి దావీదు పారిపోనారంభించినప్పుడు, మొదట్లో కొంత బుద్ధిహీనుడుగా ప్రవర్తించాడు[19]; గతిలేని పరిస్థితిలో అబద్ధమాడాడు, మోసంగా నడుచుకున్నాడు. చివరిగా, అదుల్లాము గుహలో, తన నిష్కాపట్యాన్ని తిరిగి పుంజుకున్నాడు – అక్కడనుండి తాను పరారీగా ఉన్న ఎనిమిది సంవత్సరాలకు పైబడిన కాలంలో తన నిష్కాపట్యాన్ని నిలుపుకున్నాడు. తన జనులచేతను, తన్ను బాగుగా ఎరిగిన వారిచేతను అతడు గౌరవించబడ్డాడు (24:17). ఏదియెలాగున్నా, దావీదు యిప్పుడు రెండు రకాలుగా మాట్లాడ్డం మొదలు పెట్టాడు; అతని జీవితమంతా అబద్ధంతో కూడినదిగా మారిపోయింది.

కొద్దికాలం తరువాత, దావీదు ఆకీషు వద్దకు వెళ్లి యిలా అంటున్నాడు, "రాజ పురమునందు నీయొద్ద నీ దాసుడనైన నేను కాపురము చేయనేల? నీ దృష్టికి నేను అనుగ్రహము పొందినవాడనైతే, బయటి పట్టణములలో ఒకదానియందు నేను కాపుర ముండుటకు ఒక స్థలము ఇప్పించుము" (27:5). రాజు నివసించే పట్టణములో దావీదు ఉండతగనని నాటకం ఆడాడు. వాస్తవంగా, తన సొంత కార్యకలాపాలు గమనించి చూచే రాజు కంటబడకుండా కార్యకలాపాలు జరపడానికి అతడు దూరంగా ఉండగోరాడు.[20] అబద్ధాలు, మోసాలు ఎక్కువౌతున్నాయి.

గాతుకు దక్షిణమున ఉన్న సిక్లగు[21] అనే గ్రామాన్ని ఆ దినమున ఆకీషు దావీదున కిచ్చాడు.[22] దావీదును అతని జనులును కుటుంబాల సమేతంగా అక్కడికి తరలిపోయారు. దావీదును అతని జనులును గతంలో రక్షణ వ్యాపారంలో తమ పోషణ జరుపుకున్నారు; ఇప్పుడైతే వారు నిర్మూలం చేసే వ్యాపారంలో పోషణ జరుపుకుంటున్నారు. వారు నల్లులనో, పిల్లులనో నిర్మూలం చేయడం కాదు; జనులనే నిర్మూలం చేస్తున్నారు.

> అంతలో దావీదును అతని వారును బయలుదేరి గెషూరీయులమీదను గెజెరీయుల మీదను అమాలేకీయులమీదను పడిరి. ప్రయాణస్థులు పోవుమార్గమున షూరునుండి ఐగుప్తువరకునున్న దేశములో వారు పూర్వము కాపురముండగా, దావీదు ఆ దేశస్థులను హతము చేసి, మగవానినేమి ఆడుదానినేమి యెవరిని సజీవులుగా విడువక గొఱ్ఱెలను, ఎడ్లను గార్దభములను ఒంటెలను వస్త్రములను దోచుకొని తిరిగి ఆకీషునొద్దకు వచ్చిరి ... (27:8, 9).

సిక్లగునకు దక్షిణ దిశగా, గెషూరీయులు, అమాలేకీయులు నివసించారు. ఫిలిష్తీయ, ఐగుప్తుల మధ్య గెషూరీయులు స్థిరముగా ఉండని జనం.[23] గెజెరీయులను గూర్చి మనకు తెలియదు; వారి గురించిన ప్రస్తావన ఇదొక్కటే. అమాలేకీయుల సంఘం చాలా ముఖ్యమైనది. వాళ్ళు ఏశావు[24] వంశస్థులు, వాళ్ళ దేశదిమ్మరులు, వీరు గొప్ప జనమును,

బలవంతులైన ప్రజలుగా రూపొందారు.[25] ఈ మూడు జనములును అటు ఫిలిష్తీయులకు, ఇటు ఇశ్రాయేలీయులకు శత్రువులుగా ఉన్నారు.[26]

ఇశ్రాయేలీయులను యెహోషువ ఏమి చేయనాజ్ఞాపించాడో, నిజ దేవుని ఆరాధించని నివాసులను తోలివేయండి అనేదాన్ని దావీదు చేశాడు-లేదా "సమ్మూలనంగా నిర్మూలం" చేయుమని సౌలు ఏమి ఆజ్ఞాపించబడ్డాడో (1 సమూ. 15:3, 8, 9) దాన్ని దావీదు చేస్తున్నాడని ఒకడు వాదించవచ్చు. అయితే లేఖన మేమంటుందంటే దావీదు ప్రతి పురుషును, స్త్రీని (ప్రతి బిడ్డను కూడా అయ్యుండవచ్చు) సంహరిస్తున్నది దేవునికి లోబడడానికి కాదు, తన జనులను దాచుకొనడానికి. 27:11ను గమనించు: "అతడు ఫిలిష్తీయుల దేశములో నివసించినంత కాలము ఈ ప్రకారముగా చేయునని తనను గురించి వారు చెప్పుదురేమో అని గాతుకు వర్తమానము తేగల మగవానినైనను ఆడుదానినైనను దావీదు బ్రతుక నియ్యలేదు." ఇది నిర్దాక్షిణ్యమైన, లెక్కించి చేసిన హత్య.

నీవు అరణ్యంలో గుండా పయనిస్తున్నావనుకో. నీవు వేడెక్కిపోయి, అలసినవాడవై దప్పికగొన్నావు. కొద్ది దూరంలో నీకు ఒక పట్టణం కన్పించింది. అక్కడ సేద తీర్చుకోవచ్చుననే ఆశతో ఓపిక చేసికొని తొందరగా నడిచావు; కాని నీవు సమీపానికి వస్తుండగా ఏదో యిబ్బంది కలిగేలా ఉన్నట్టు గ్రహించావు. వినిపించే శబ్దం కుక్కల కవర్లాట, పైన డేగలు చుట్టు మూగాయి. ఆ బస్తీ పొలిమేరలకు వచ్చేసరికి, గాలి విసరి చచ్చిన శవాల వాసన నిన్ను చుట్టుకొంది. నోటిలో గుడ్డపెట్టుకొనకుండానే కొన్ని అడుగులు ముందుకు వేసేసరికి రహదారి వచ్చింది. నిన్ను అదిమి మాట రాకుండ చేసే ఘోరమైన దృశ్యం కన్పిస్తుంది. మృత దేహాలు ఎక్కడంటే అక్కడ మట్టిలో పారవేయబడ్డాయి. అడవి కుక్కలు, ఆకాశ పక్షులు వాటిని తినడానికి తగవులాడు కుంటున్నాయి. అది దాటేలోపే నీ కడుపు తిప్పింది. నీ ప్రయాణాన్ని కొనసాగించావు, ఒక ప్రశ్న నీ మనస్సును వెంటాడుతోంది: "ఆ పనిని ఎవరు చేసి ఉంటారు? ఎవరూ?"

"దేవుని హృదయానుసారుడైన దావీదు" ఆ పని చేశాడు; దూరదేశం ప్రయాణమై పోయిన దావీదువలననే ఈ పని జరిగింది.

అయితే అదే కథయొక్క అంతం కాదు. ఇంతటి భయంకరమైన పనులనుండి కొల్లగొట్టిన సొమ్ముతో తిరిగి వచ్చి, అతడు రాజైన ఆకీషు వద్దకు వచ్చి రిపోర్టు యిస్తూ ఉండేవాడు (అతని భాగం తనకు కూడా యిచ్చే వాడేమో). దావీదు ప్రవేశింపగానే, "ఈ రోజు నీవు ఎక్కడ దాడి చేశావు?" అని అడిగితే, దావీదు యొక్క జవాబు, "-యూదా దేశమునకును యెరహ్మెయేలీయుల దేశమునకును కేనీయుల దేశమునకు దక్షిణముగా మేము ఒక ప్రదేశములో జొరబడితిమనెను" (27:10).

"నెగెవ్"[27] అంటే "ఎండిన భూమి" లేక "ఎడారి" అని అర్థం.[28] అది బెయెర్షెబా మొదలుకొని సీనాయి ఉన్నత ద్వీప కల్పంవరకు ఎడారిగానున్న అరణ్య భూమి, నాటికి నేటికి ఒకటే. యూదాకు దక్షణపు ఇశ్రాయేలీయుల సివారులను"యూదా యొక్క నెగెవ్" అని సాధారణంగా సూచింపబడుతుంది. "యెరహ్మెయేలీయుల నెగెవ్" అనేది హెబ్రోను ఏరియాలో ఉన్న అరణ్య ప్రాంతం కావచ్చు. యెరహ్మెయులు కాలేబీయులకు కావలసిన వారును దగ్గర సంబంధాలు కలిగి ఉన్నారు.[29] "కేనీయులయొక్క నెగెవ్" బెయెర్షెబాకు

తూర్పున రాతిమయమైన ప్రదేశం. కేనీయులు ఇశ్రాయేలీయులతో మోషే కాలంనుండి సంబంధాలు కలిగియున్నారు; మోషే మామయైన యిత్రో కేనీయుడే.[30]

మరో మాటల్లో చెప్పాలంటే, దావీదు ఇశ్రాయేలీయుల మీదను, వారి స్నేహ దేశాల మీదను పడుతున్నట్టు ఆకీషుకు తెలియజేస్తే – ఆకీషు నమ్ముతున్నాడు. తన దక్షిణ సరిహద్దును దావీదు కాపాడుతున్నట్టు ఆకీషు తలంచాడు, అతనికి బహుమానాలు తీసికొని రావడం, అతడు యూదాకు తిరిగి వచ్చేది అసాధ్యమైనట్టు బ్రతకడంగా కన్పిస్తుంది. సంతోషంతో ఆకీషు ఏమనుకొంటున్నాడో చూడు: "–దావీదు తన జనులైన ఇశ్రాయేలీయులు తనయందు బొత్తిగా అసహ్యపడునట్లు చేసెను గనుక అతడు సదాకాలము నాకు దాసుడుగాను ఉండునని అనుకొని ఆకీషు దావీదు మాట నమ్మెను" (27:12). దావీదు ఎంత సామర్థ్యంగల అసత్యవాది అయ్యాడో ఎంత నేర్పుగా అతడు రాజును మోసగించాడో! అన్నది మనసుకు విచారం కలిగిస్తుంది. సౌలు నాబాలు మంచికి బదులుగా చెడు నిచ్చినందువల్ల దావీదు వారిపట్ల కలత చెందాడు. అందుకనే అతడిప్పుడు ఆకీషుపట్ల అలాగే ప్రవర్తించాడు. ఆకీషు చూపించిన ఆత్మీయతకు, మోసం, అబద్ధం అనే వాటిద్వారా రుసుము చెల్లించాడు.

నీ నిష్కాపట్యాన్ని పాడుచేసికోకుండ నీవు దూరదేశము ప్రయాణమై పోవు. నీవు వెళ్లి నీ క్రైస్తవ ప్రమాణాలను నిలుపుకుంటానని నీవు చెప్పుకోవచ్చు. "ఇప్పుడు నేను వెళ్లడం ప్రయోజనకరం, కాని అది కొద్దికాలంవరకే" హాని జరుగకముందే నేను బయటికి వచ్చేస్తాను" అని నీవు అనవచ్చు. దీన్ని గుర్తుంచుకో: నీవు బాధింపబడతావు.

## తేటైన ఉద్దేశాలను తేటకానట్టి వాటికి అతడు మార్పిడి చేశాడు

ఇశ్రాయేలీయుల సైన్యములలోను సౌలుతోను ఫిలిష్తీయులు తాడో పేడో తేల్చుకునే యుద్ధానికి సిద్ధమౌతున్నట్టు 28వ అధ్యాయం ప్రారంభమౌతుంది. ఆకీషు దావీదును పిలిపించి అతనితో యిలా అన్నాడు. "నేను దండెత్తగా నీవును నీ జనులును నాతో కూడ యుద్ధమునకు బయలుదేరి రావలెనని పరిష్కారముగా తెలిసికొనుము" (28:1). ప్రాచీన తూర్పు సమీపంలో, ఒక దేశంలో ఆశ్రయం కోరితే, మిలిటరి సేవలు చేయవలసిన బాధ్యతను అంగీకరించవలసి ఉంటుంది.

ఇది దావీదుకు తెచ్చినట్టి చిక్కును గూర్చి ఆలోచించు. ఆకీషుతో వెళ్ళడానికి నిరాకరిస్తే, దావీదుయొక్క వంచన బయటపడుతుంది. అయినా, పోవడమంటే, దావీదు యిన్నేళ్లుగా దేనినుండి దూరంగా తొలిగిపోయాడో దానినే జరిగించుటలో చిక్కుకున్నాడన్న మాట; అంటే, అతడు దేవుని అభిషిక్తునితోను తన ప్రాణ స్నేహితుడైన యోనాతానుతోను పోరాడవలసియుంటుంది. దేవుని బిడ్డ దూరదేశం ప్రయాణమైపోతే ఈలాటి దుస్థితిలో చిక్కుకుని పోవలసియుంటుంది.

దావీదు జవాబు అర్థమయ్యి కానట్టుంది: "–నీ దాసుడనైన నేను చేయబోవు కార్యము ఏదో అది నీవు యిప్పుడు తెలిసికొనెదవు" (28:2ఎ). దావీదు మాటలు తన సపోర్టుకు అభయమైనట్టు ఎంచి, "–అలాగైతే నిన్ను ఎప్పటికి నాకు సంరక్షకుడుగా నిర్ణయింతునని " ఆకీషు అన్నాడు (28:2బి). అంటే, "నేను నిన్ను నమ్మి, నా ప్రాణాన్ని నీ చేతుల్లో పెడుతున్నాను"!

అని అన్నాడన్న మాట. బహూశ, ఏదియేమైన, తాను ఏమి చేయనున్నాడో దానిని ఆకీషు "కనుగొనును" అని దావీదు అర్థమేమో. అయితే దావీదు పలికిన మాటలకు అర్థమేమో ఎవనికి తెలుసు? దూర దేశంలో ప్రతిదీ స్పష్టంగా లేకుండ పోతుంది.

ఎజ్రెయేలు పట్టణానికి సమీపముననున్న గిల్బోవ కొండ చరియలోని దిగువ భాగముననున్న లోయలో ఇశ్రాయేలీయులు దిగగా, (28:4), [31] ఫిలిష్తీయులు తమ సైన్యాలతో దండెత్తి వచ్చి షూనేములో దిగారు (28:4; 29:1లను కూడా చూడు). ఫిలిష్తీయుల సైన్యము ఉత్తర దిశగా సాగివస్తున్నట్టు అధ్యాయం 29 ప్రారంభమౌతుంది. 2వ వచనంలో దావీదును అతని జనులును ఆకీషుతో కలిసి దండు వెనుక తట్టు వస్తున్నారు. ఆఫెకునకు వచ్చేవరకు సైన్యం సాగింది, షూనేము అనే వారి గమ్యం చేరడానికి యింకా నలభై మైళ్ల దూరముంది. అక్కడ వారు తమ సైన్యాలను వ్యూహం చేయడానికి ఆగారు (29:1).

ఆఫెకుకు వెళ్లడానికి మూడు దినాలు పట్టింది.[32] అతడు ద్వంద్వ జీవితాన్ని జీవిస్తున్నందున దావీదు తన చిక్కును గూర్చి ఆలోచించడానికి ఈ మూడు దినాలు పట్టింది. తన తలంపులను గూర్చి ఊహించు: "నేనేమి చేయాలి? నేను నా జనులు దేవుని అభిషిక్తునితో పోరాడము ... ఒకవేళ మేము పోరాడేమే అనుకో అప్పుడు సౌలు, యోనాతానులకు వ్యతిరేకంగా చేయలేము. లేదు, అలాగైతే మనం మన స్వజనులతో పోరాడినట్టౌతుంది. తన అభిషిక్తునికి హాని చేయకుండడం మాత్రమే కాదు, అతనికి హాని చేయకుండ యితరులను కూడా ఆపాలని దేవుడు నాకు సూచించాడు. ... యుద్ధంలో దిగినప్పుడు, అది ప్రారంభం కాగా, సౌలుయొక్క సైన్యం ముందు భాగాన ఎదుర్కొన్నప్పుడు, నేను నా జనులు వెనుక ఉన్నాం గనుక, మేము సౌలు సైన్యాన్ని సమీపించామనుకో, నన్ను చంపుడని అతడు వారికి ఆజ్ఞాపిస్తున్నాడు. అప్పుడు మేము ఒక సైన్యంతో కాదు, రెండు సైన్యాలతో పోరాడవలసివస్తుంది ... నేను ఈ పని చేయలేనని ఆకీషుకు చెప్పవలసి యుండవచ్చు. ఒకవేళ అది నేను చేశానంటే, ఫిలిష్తీయుల సైన్యమంతా మామీదికి మళ్లి, మమ్మును తుడిచివేస్తారు ... లేక మేము యుద్ధము చేస్తున్నట్టు నటించి, నిజంగా యుద్ధం చేయకుండ మానుకుందాం. మరోవైపు, మమ్మును మేము కాపాడుకొనక పోయినట్లయితే, అది ఆత్మహత్య చేసికొన్నట్టే ... నేనేమి చేయాలి? ఏమి? ఏమి?!"

ఆఫెకు వద్ద, సైన్యాలన్నీ సమకూడినప్పుడు, దావీదు ఆకీషు సైనికులతో ఉండడం ఫిలిష్తీ సర్దారులు చూచి, ఆకీషుపై వారు యిలా విరుసుకు పడ్డారు:

> ఫిలిష్తీయుల సర్దారులు – ఈ హెబ్రీయులు[33] ఏల రావలెను అని ఆకీషును అడుగగా అతడు ఇన్ని దినములు ఇన్ని సంవత్సరములు నాయొద్దనుండిన ఇశ్రాయేలీయుల రాజైన సౌలునకు సేవకుడగు దావీదు ఇతడే కాడా? ఇతడు నాయొద్ద చేరిన నాటనుండి[34] నేటివరకు ఇతనియందు తప్పేమియు నాకు కనబడలేదని ఫిలిష్తీయుల సర్దారులతో అనెను (29:3).

దావీదు చర్యలను గూర్చి ఆకీషు వర్ణనను గుర్తించు: అతడు "నా యొద్దకు చేరాడు," దావీదు ఫిలిష్తీయాకు రావడం మంచి "సైనిక నడవడికయై" యుంటుందని భావించాడు. ఆకీషు దాన్ని "కావాలని వదలుకొన్నట్టు" పిలిచాడు. మనం దూరదేశం ప్రయాణమై

పోయినప్పుడు, మన ఉద్దేశాల విషయంలో మనలను మనమే మోసపుచ్చుకున్న వారమౌతాం, కాని మనలను మనం చూచుకోగలిగే దానికంటెను స్థానికులే మనలను మరింత స్పష్టంగా చూస్తారు.

ఈ సమయంలో, "దావీదు పని అసాధ్యమయ్యేలా" దేవుడే జోక్యం పుచ్చుకొని, అనువుకాని మూలం ద్వారా తీర్మానం చేశాడు: ఫిలిష్తీయుల సర్దారులచేత ఈ కార్యం జరిగించాడు. దావీదు పక్షంగా ఆకీషు పలికిన వకాల్తా ఆ సర్దారులను సంతృప్తి పరచలేదు.[35] "ఆ మనుష్యుని వెనుకకు పోనిమ్ము" అని వారు ఆకీషుకు ఆదేశించారు (29:4).

తాను దావీదునందు[36] నిస్సందేహమైన నమ్మిక కలిగియున్నను, సైన్యంలోని అధిపతులను బట్టి, దావీదును అతని జనులును సిక్లగునకు తిరిగి వెళ్లుడని ఆకీషు చెప్పాడు. నమ్మికను అధికం చేయాలనే తత్వంతో దావీదు ఆక్షేపణ తెలిపాడు. ఈ ఆక్షేపణ కూడా స్పష్టంగా తెలుపలేదు: "దావీదు–నేనేమి చేసితిని? 'నా యేలినవాడవగు రాజా, నీ శత్రువులతో యుద్ధము చేయకుండుటకై నేను రాకుండునట్లు నీ యొద్దకు వచ్చిన దినమునుండి నేటివరకు నీ దాసుడనైన నాయందు తప్పేమి కనబడెనని ఆకీషునడిగెను' " (29:8). "నా యేలినవాడైన రాజుయొక్క శత్రువులు" అనేది ఆకీషు యొక్క శత్రువులే కావచ్చు–లేదా సౌలు యొక్క శత్రువులే కావచ్చు.[37]

దావీదు మాటల యొక్క భావమేమైయున్నా, అతని ద్వారా యివ్వబడిన అవకాశాన్ని సద్వినియోగం చేసికొనడానికి సమయాన్ని వ్యర్థం చేయలేదు. మరు ఉదయం సూర్యోదయం అయినప్పుడు, అతడును అతని జనులును సిక్లగు వెళ్లడానికి తిరిగారు, ఫిలిష్తీయులైతే సౌలుతో ముఖ్యమైన యుద్ధానికి ముందుకు సాగారు.[38]

దావీదు యింటికి త్వరగా వచ్చాడు, అది అతనికి చాలా విశ్రాంతిని యిచ్చియుండవచ్చు. ఆకీషును తాను మోసగించినప్పుడు గాని, రాజు అతని గూర్చి మెచ్చుకున్నప్పుడు గాని దావీదు మనస్సాక్షి అతని బాధించియుండవచ్చు.[39]

నీ జీవితంలో నీ యథార్థతను నిలుపుకున్నట్టయితే, నీవు యింకా ఏ యితరమైన వాటిని సాధించావో లేదో అది వేరే విషయం గాని, నీవు మాత్రం విజయం సాధించినట్టే. మరోవైపు నీవు నీ యథార్థతను కోల్పోయావంటే, నీవు యింకా ఏమి సాధించినా సరే, నీవు ఓడిపోయినవాడవే. నీ జీవితపు అంతంలో, "నేను యథార్థవంతుడనై ప్రవర్తించితిని" (కీర్తన. 26:1–4) అని చెప్పగలిగేలా జీవించడానికి తీర్మానించుకో.

## చెడ్డ పరిస్థితిని మరింత చెడ్డదానికి అతడు మార్పిడి చేసికొన్నాడు

అతడును అతని జనులును సిక్లగునకు తిరిగి వచ్చినప్పుడు, దూర దేశమునకు వెళ్లిన దావీదు యొక్క ప్రయాణం అట్టడుగును అంటింది.

> దావీదును అతని జనులును మూడవ దినమందు సిక్లగునకు వచ్చిరి; అంతలో అమాలేకీయులు దండెత్తి దక్షిణ దేశముమీదను సిక్లగుమీదను పడి, కొట్టి దానిని తగులబెట్టి, ఘనులనేమి అల్పులనేమి అందులోనున్న ఆడువారందరిని చెరపట్టుకొని చంపక వారిని తీసికొనివెళ్లిపోయి యుండిరి. దావీదును అతని జనులును పట్టణమునకు

> వచ్చి అది కాల్చబడి యుండుటయు, తమ భార్యలును కుమారులును కుమార్తెలును చెరలోనికి కొనిపోబడి యుండుటయు చూచి ఇక ఏడ్చుటకు శక్తిలేక పోవునంత బిగ్గరగా ఏడ్చిరి. ... అహీనోయము ... అబీగయీలు అను దావీదు ఇద్దరు భార్యలును చెరలోనికి కొనిపోబడగా చూచి దావీదు ... (30:1-3, 5).

సిక్లగునుండి దక్షిణమునను్న అమాలేకీయుల పట్టణాలపై దావీదు పడియుండెను. అతని దేశజనులందరూ హత్య చేయబడిన పట్టణపు దృశ్యాన్ని జ్ఞాపకం చేసికో. "చుట్టూ ఏది పోతుందో అదే తిరిగి వస్తుంది" అని మా నానమ్మ అనేది. నెగవులోనికి (యూదా, ఫిలిష్తీయ దక్షిణ భాగాలకు[40]) అమాలేకీయుల దండయాత్ర అసాధారణమైనదేమీ కాదు, కాని సిక్లగును కాల్చడం అసాధారణమే. దావీదుయొక్క ఊహలు ఏమైయున్నా, దావీదును అతని జనులును ఆ చావులకు బాధ్యులన్న విషయం అమాలేకీయులకు తెలిసే ఉంటుంది. అందుకే వారు ఆ పని చేసి యుంటారు.

తిరిగి నీ ఊహను సరిగా ఉంచు. ఆఫెకునుండి సిక్లగువరకు డెభై ఎనభై మైళ్ల దూరముంటుంది. అది మూడు రోజుల నడకై యుంటుంది. దావీదును అతని జనులును తమ కుటుంబాలతో తిరిగి కలిసికోవాలని అలసి, వేసారి పోయి యిండ్లకు వచ్చారు. వారు సమీపానికి వచ్చేసరికి, నమ్మలేనంత అరుపు వినిపించింది. గతంలో పట్టణం ఎక్కడ ఉందో, అక్కడే పొగ రాజుతున్న శిథిలాలున్నాయి. కొండ చరియను దిగి ఆ మనుష్యులు తమ భార్యా పిల్లల పేర్లు పెట్టి కేకలు వేస్తూ ఆ పొగలోగుండా తిరిగారు. వారు ఏ జవాబు పొందలేదు. వీచుతున్న గాలి మాత్రమే నిప్పు కణికెలను రేపుతుంది.

అత్యధికమైన కీడు సంభవించిందని భయపడి, ఇంకా వేడిగానున్న రాళ్ల కుప్పలను పట్టి చేతులతోనే చేతుల బొబ్బలు పొక్కేవరకు త్రవ్వి, వేసారి కూలబడ్డారు. ఆ బూడిదెను తమ ముఖాలమీద చల్లుకొంటూ, కన్నీటి ధారలవలన సారలు కట్టిన ఆకారాల్లో మిగిలిపోయారు. ''దావీదును ఆతని జనులును పట్టణమునకు వచ్చి అది కాల్చబడియుండుటయు, తమ భార్యలును కుమారులను కుమార్తెలును చెరలోనికి కొనిపోబడి యుండుటయు చూచి ఇక ఏడ్చుటకు శక్తిలేనంత బిగ్గరగా ఏడ్చిరి" (30:3, 4) అని చెప్పబడింది.

1993లో నేను దీన్ని వ్రాసేటప్పుడు, లాస్ ఏంజిలెస్ అడవులు తగలబడ్డాయి. పునాదులకంటె ఎక్కువగా మిగిలిన జనులు తమ యిండ్లకు తిరిగి వచ్చిన దృశ్యాన్ని మేము చూచాం. ఆ దృశ్యాన్ని చూచి, తమ తలలను ఊపుచూ, "పోయింది. అంతా పోయింది." అన్నవారి ముఖాలను మేము తిలకించాం. దాదాపుగా కూలబడ్డవారిని చూచాం. ఆ భయంకరమైన విపత్తు తరువాత మిగిలినది ఏదైనా ఉందేమోనని ఆ బూడిదె కుప్పలగుండా వెళ్లినవారిని వీక్షించాం. ఆ సమయంలో దావీదు యొక్కయు ఆతని జనులయొక్కయు ఉద్వేగం ఎలాటిదై యుంటుందో వారు ఎరిగి యుంటారు.

అయినా సిక్లగు వద్ద దుఃఖాంతము యింకను ముగియలేదు. జనులు తమలో తాము గుస గుస లాడుకొంటూ దావీదు మీద విషపు చూపులు చూచారు. వారి సంభాషణ యొక్క రవ్వలు దావీదు చెవులను తాకాయి: "అతడు యూదాలోనే ఉండి ఉన్నట్టయితే యిది ఎన్నడు జరుగకుండానే ఉండేది!" "మన సొంత కుటుంబాలను కాపాడుకొనడానికి

గాను మనలో కొందరిని యిక్కడ వదిలిపెట్టి యుండవలసింది!"; "ఇదంతా దావీదు తప్పే!" (అని వారు అని యుండవచ్చుట). 6వ వచనం యిలా గుర్తిస్తుంది: "దావీదు మిక్కిలి దుఃఖపడెను. మరియు తమ తమ కుమారులను బట్టియు కుమార్తెలను బట్టియు జనులకందరికి ప్రాణము విసికినందున రాళ్లు రువ్వి దావీదును చంపుదము రండని వారు చెప్పుకొనగా ..." "దావీదు మిక్కిలి దుఃఖపడెను" అనే ప్రయోగాన్ని వ్యాఖ్యానించడానికి సాధ్యమౌతుంది. దావీదు అదుల్లాము గుహకు చేరినప్పుడు, ప్రాకుతూ, నడుస్తూ ఉండే జీవులతో కూడా తాను ఒంటరిగానే ఉన్నాడు (కీర్తన. 142:4). ఇప్పుడైతే ఆరువందల మంది సైనికులు తమ చేతులతో రాళ్లు పట్టుకొని ఉన్నారు; ఇప్పుడు అతడు తన సొంత సైన్యం చేతిలోబడ సిద్ధంగా ఉన్నాడు లేక చంపబడబోతున్నాడు.

తప్పిపోయిన కుమారుడు ఇంటిని విడిచిన మొదటి దశలో కాంతివంతమైన దీపాలతో మా వడిగల గుంపులలోను ఉన్నాడు, సరియైన నిర్ణయం చేసికొన్నాడని తాను నిస్సందేహంగా తలంచి యుండవచ్చు. అతడు పందులను[41] మేపే పనిలోను, వాటికి పెట్టే పొట్టుతో తన కడుపు నింపుకునే స్థితికి దిగజారడానికి ఎక్కువ కాలం పట్టదు. దూర తీరానికి పోతే వచ్చే పరిస్థితి ఇది. అది ఆశలు కలిగిస్తుంది. క్రొత్త మెరుపులు చూపుతుంది-వెంటనే వాటిని లాక్కుంటుంది. మాదక ద్రవ్యాలు ముందు సంతోషాన్ని కలిగిస్తాయి. తరువాత జీవితాన్ని నరకం చేస్తాయి. ఇంటినుంచి దూరంగా పారిపోదం ముందు స్వాతంత్ర్యాన్ని కలిగిస్తుంది. తరువాత వంటరితనాన్ని నిరాశకు దారితీస్తుంది. వివాహంలో విడాకులు స్వేచ్ఛను కలిగిస్తాయి, తరువాత నవ్వులపాలు చేస్తాయి, "కాని అది నిజంగా అంతం కాలేదు"! దూర దేశపు వాగ్దానాలతో మోసపోవద్దు. నీకు సంతోషం కలిగించని పరిస్థితిని ఆపదలతో ఎదుర్కోవలసి వస్తుంది సుమీ!

**అనుకూలమైన పలుకుబడిని ప్రతికూలమైన దానికి అతడు మార్పిడి చేసికొన్నాడు**

దూర దేశానికి దావీదు తనంటత తానే వెళ్లలేదు; అతడు వారితో యితరులను కూడా తీసికొని వెళ్లాడు (30:2, 3). తనచుట్టు పోగైన ఆరువందల మందిని దావీదు తనతో తీసికొని పోయాడు. అనామకులైన పలు జీవిత విభాగాలకు చెందిన జనులు అతనిచుట్టు పోగుకాగా, వారిని ఏకముగా సమకూర్చి గెరిల్లా యుద్ధ నిపుణులు తీర్చిదిద్ది తాను వెళ్లే చోట్లకంతా వచ్చేటట్టు చేసుకున్నాడు.[42] దావీదు వారి కుటుంబాలను తన కుటుంబంతో కూడా తీసికునిపోయాడు. పైగా, దావీదు కీర్తి పెరిగే కొలది సిక్లగులోని అతని వద్దకు సమీపమునున్న ఇశ్రాయేలీయుల గోత్రికులు వచ్చారు.[43] ఆరంభ ఫలితంగా నిజ దేవుని ఆరాధించని సమాజంలో జీవించే శోధనకు వారు గురి అయ్యారు. కడపటికి, స్త్రీలు, పిల్లలు కొల్లబోయారు, పురుషులు పాడుచేయబడ్డారు.

దూర దేశానికి ప్రయాణమై పోయేవారు "తమ్మును గూర్చి, తమ కోర్కెలను గూర్చి" మాత్రమే ఆలోచన చేస్తారు. "నేను చేసేది నా సొంత పనియే"నని అది "యింకా ఎవరినీ బాధించదని" వారనుకుంటారు. అది ఎల్లప్పుడు యితరులను బాధిస్తూ ఉంటుంది. తప్పిపోయిన కుమారుడు యింటనుండి వెళ్లినప్పుడు, హృదయం పగిలిపోయిన తండ్రిని వెనుక వదలి వెళ్లాడు. నీవు దూర దేశం వెళ్లినప్పుడు, నీవు సమస్తాన్ని ఆపదలో ముంచుతావు. నీ

సొంత ఆత్మను రిస్కులో ఉంచుకొనడం మాత్రమే గాక, నీకు సన్నిహితంగా ఉన్నవారి ఆత్మలను సహితం రిస్కులో పడవేస్తావు. దావీదువలె నీకు కుటుంబం ఉంటే, కుటుంబాన్ని కూడా రిస్కులో పెడతావు. “ఇది చివరికి నా కుటుంబానికి నా స్నేహితులకు ఏమి చేస్తుంది?” అని సహృదయంతో ఆలోచన చేసిన అనేకులు దూర దేశ ప్రయాణాలను మానుకున్నారు.

దూరదేశం వెళ్లటంలో యివ్వబడే తాత్కాలికమైన ఏ స్వేచ్ఛ అయినా, చివరికి ఆ స్వేచ్ఛ కొరకైన రుసుము బహు ఎక్కువగా ఉండబోతుంది. దేవునితోనే ఉండి పూర్ణంగా ఆయనయందు నమ్మికయుంచే-శ్రేష్ఠమైన ఒక మార్గం ఉంది.

## దేవునివైపుకు పునరుద్ధరణ (1 సమూ. 30:6-31)

దేవుడు మన జీవితంలోనికి శ్రమలను అనుమతించేది, వెనుకకు తిరిగిపోయేదానికి కాదు. మనలను మన మోకాళ్ల మీదికి దించడానికి. మనం మన మోకాళ్ల మీద ఒరిగినప్పుడు, చివరికి మనం మన మోకాళ్ల మీదికి వస్తాం. తమ చేతుల్లో రాళ్లు పట్టుకొనియున్న ఆరువందల మందిచే దావీదు చుట్టబడినవాడై, నిరాశలోనికి దిగిపోయినవాడై ఉండగా, ఒకటిన్నర సంవత్సరపు దావీదు జీవిత కాలంలో ప్రస్తావింపబడని: దేవుని నామం కన్పిస్తుంది. 30:6 చివరి భాగంలో, “దావీదు తన దేవుడైన యెహోవాను బట్టి ధైర్యము తెచ్చుకొనెను” అని చదువుతాం. దావీదు గత జీవితంలో నిరాశపడినప్పుడు, యోనాతాను అతనిని “దేవునియందు బలపరచాడు” (23:16), ఇప్పుడు దావీదుకు యోనాతాను లేడు,[44] అయితే అతడు తన్ను తాను దీర్ఘంగా పరీక్షించుకొని, దేవుడు అనుగ్రహించగల బలాన్ని కనుగొన్నాడు (ఎఫెసీ. 3:20).

దావీదు దేవుని వైపునకు తిరిగినప్పుడు, సంగతులు మంచిగా కనిపించాయి. అతడును అతని జనులును ఎవరిని చూడలేక పోయినా, వారి కుటుంబాలు యింకను సజీవంగానే ఉండియుండవచ్చు.[45] పైగా, దావీదును అతని సైనికులును సజీవంగా ఉండి అమాలేకీయులను తరుమగలవారుగనే ఉన్నారు. వారికి యింకను నిరీక్షణ ఉంది. ఫిలిష్తీయాకు దావీదు వెళ్లగోరినప్పుడు చేయవలసిన పని దావీదు యిప్పుడు జరిగించాడు: “అతడు యెహోవా యొద్ద విచారణ చేశాడు” (30:7, 8). “-నేను ఈ దండును తరిమినయెడల దాని కలిసికొందునా అని యెహోవా యొద్ద దావీదు విచారణ చేయగా యెహోవా - తరుము, నిశ్చయముగా నీవు వారిని కలిసికొని తప్పక నీవారినందరిని దక్కించుకొందువని సెలవిచ్చెను” దావీదు హృదయములోని నిరీక్షణ నిశ్చయమయ్యింది.

తన దండులో ఎదుగుతున్న వ్యతిరేకతకు అది పరిపూర్ణమైన విరుగుడుగా పిలుపు నిచ్చిన ఆ కార్యము పని చేసింది. ఆ జనులు తమ రాళ్లను పడవేసి, ఆయుధములను చేబూని దావీదుతో దక్షిణానికి పయనించారు. ఏదియేలాగున్నా, జనులు మాత్రం బడలికగానున్నారు. కొంత దూరం వెళ్లేసరికి రెండు వందల మంది కూలబడ్డారు. ఆగిపోవడం దావీదుకు సులభంగా ఉండేదే. తానును తక్కినవారును వేసారిపోయిన స్థితికి చేరుకున్నారు. వారి ఆహార వస్తువులు దాదాపు అయిపోయాయి.[46] అమాలేకీయులు

ఎక్కడ ఉన్నారో కూడా దావీదుకు తెలియదు; దేవునియందు తనకున్న విశ్వాసాన్ని బట్టి ఆ నాలుగు వందల మందితో ముందుకు సాగాడు.

అతని విశ్వాసం మంచి ఫలాన్నిచ్చింది. అమాలేకీయుడగు తన యజమానిచే విడువబడి చనిపోయే స్థితిలో ఉన్న ఒక ఐగుప్తీయుడైన బానిస వారికి తటస్థపడ్డాడు. ఎండిన పండ్లతోను నీళ్లతోను అతని బలపరచారు. దేవుని కరుణాహస్తాన్ని బట్టి, ఆ అమాలేకీయులు తమ విజయోత్సాహము ఎక్కడ జరుపుకొన వెళ్లింది ఆ బానిస ద్వారా తెలిసికొన్నారు. వారియొద్దకు ఆ ఇశ్రాయేలీయులను అతడు తోడుకొని పోయాడు.[47]

తాము క్షేమంగా ఉన్నామనే భావనతో అమాలేకీయులు అశ్రద్ధగా ఉండిపోయారు. భోజన పానీయాలతో విలాసంగా రాత్రియంతా గడిపారు. దావీదును అతని జనులును ఉదయంవరకు విశ్రమించారు.[48] శత్రువులు మైకంలో ఉన్నప్పుడు వీరు వారిపైబడ్డారు. అమాలేకీయులు అధిక సంఖ్యాకులైయున్నా,[49] తమ కుటుంబాలను తప్పించుకోవాలని కోపోద్రేకంలో ఉన్నవారికి వీరు సులభంగానే లోబడ్డారు. దావీదు శత్రువును కలిసికొని "అందరిని దక్కించుకుంటానని" చెప్పిన మాటను బట్టి అతడు అలా చేయగలిగాడు.

> ఈలాగున దావీదు అమాలేకీయులు దోచుకొని పోయిన దానంతటిని తిరిగి తెచ్చుకొనెను. మరియు అతడు తన యిద్దరు భార్యలను రక్షించెను. కుమారులేమి కుమార్తెలేమి దోపుడు సొమ్మేమి వారు ఎత్తుకొనిపోయిన దానంతటిలో కొద్దిదేమి గొప్పదేమి యేదియు తక్కువకాకుండ దావీదు సమస్తమును రక్షించెను (30:18, 19).[50]

దావీదును రాళ్లతో కొట్టబూనిన జనులు యిప్పుడు మరో రకమైన పాట పాడసాగారు. ఇది దావీదు విజయముగా వారు చూచి, "ఇది దావీదు దోపుడు సొమ్ము" అని జనులు కేకలు వేశారు (30:20). అయినా, ఆ విజయానికి దేవుడు కారణమని దావీదుకు తెలుసు. "అందుకు దావీదు వారితో ఇట్లనెను – నా సహోదరులారా, యెహోవా మనలను కాపాడి మనమీదికి వచ్చిన ఈ దండును మనకప్పగించి మనకు దయచేసిన దాని విషయములో మీరు ఈలాగున చేయకూడదు" (30:23). కొల్లగొట్టి తెచ్చిన సొమ్మును యుద్ధానికి రాలేకపోయిన ఆ రెండువందల మందికిని,[51] దక్షిణ యూదా పట్టణాలవారికి పంచిపెట్టారు.[52]

దావీదుకు ఆయన కావలసివచ్చినప్పుడు, దేవుడు అక్కడ ఉన్నాడు. మనం మాటి మాటికి వినవలసిన సత్యం యిక్కడ ఉంది: మన దేవుడు రెండో తరుణాన్ని అనుగ్రహించే దేవుడు. తప్పిపోయిన కుమారుని తండ్రి వానికి ఎదురుగా వెళ్లి మెడ మీదపడి ముద్దు పెట్టుకొనినట్టే, భద్రపరచే తన ప్రేమగల హస్తాలతో ఆయన దావీదును ఆదుకున్నాడు. దావీదు ఆత్మ సంబంధమైన దారికి తిరిగి వచ్చాడు.

ఆయన మనకు అవసరమయ్యేవరకు దేవుడు మనలను అలక్ష్యం చేస్తాడని ఆలోచించడానికి నేను ప్రోత్సహించినట్టు ఎవరును తలంచనక్కర లేదు. మనం ఆయన వద్ద ఆశ్రయం కొరకు పరుగెత్తినట్టయితే, మనలను ఆయన తప్పక దీవిస్తాడు. జీవముగల దేవుని విడిచిపెట్టే అపాయం ఉంటుందని బైబిలు స్పష్టంగా బోధించింది.[53] నేను దీన్ని

ఎందుకు చెప్తున్నానంటే, దూరదేశ ప్రయాణమై పోయి తిరిగి రావడానికి బహుగా ఆలస్యమయ్యింది, యింక నిరీక్షణ లేదు అనుకున్న వారెవరైనా ఉంటే, వారిని ప్రోత్సహించ డానికి ఈ సంగతులు చెప్తున్నా. దేవుని యింటనుండడానికి తిరిగి రా. "తనకు బుద్ధి వచ్చినప్పుడు" తప్పిపోయిన కుమారుని వలె (లూకా 15:17), నీ జీవితంలో ఉన్న పాపాన్ని ఒప్పుకో, దానినుండి మారుమనస్సు పొంది (లూకా 15:17–19, 21), యింటికి తిరిగి రమ్ము. నిన్ను అంగీకరించడానికి దేవుడు సిద్ధంగా ఉన్నాడు!

## ఇంటికి తిరిగి రావడం (2 సమూ. 2:1-4)

దావీదు పచ్చిక బయలులో అనామకుడుగా తిరిగే దినాల్లో సజీవంగా ఉన్నాడు; అతడు గొల్యాతును సంహరించి ఘనత పొందిన దినాలను తట్టుకొన్నాడు; పది సంవత్సరాలు పారిపోయిన వాడుగా చావక బ్రదికే యున్నాడు. కష్టమైన మార్గంలో అవసరమైన పాఠాలు నేర్చుకున్నాడు. "కఠినమైన దెబ్బలు అనే పాఠశాలలో"నుండి ప్రతిష్ఠాత్మకంగా కృతార్థుడయ్యాడు. అతడు రాజు కాబోయే కాలం ఆసన్నమయ్యింది. అతడు యింటికి వెళ్లే సమయం వచ్చింది.

దావీదును, అతని జనులును సిక్లగులో ఉన్నట్టు 2 సమూయేలు ఆరంభమౌతుంది.[54] అక్కడ రెండు దినాలున్నారు. తిరిగి కట్టాలన్న భావంతో, ఆ రాళ్ల గుట్టల్లో ఏవైనా దొరుకుతాయేమోననే ఆశతో తవ్వుతున్నారనే దానికి సందేహం లేదు. మూడవ దినాన, ఒక అమాలేకీయుడు[55] వారి శిబిరాల్లోనికి వచ్చాడు. తాను యుద్ధ భూమినుండి వస్తున్నట్టును, సౌలును యోనాతానును మరణించినట్టును అతడు తెలియజేశాడు.[56] దావీదును అతని జనులును హృదయం పగిలినవారయ్యారు. "బలాఢ్యులు ఎట్లు కూలిరి?"[57] అనే చర్చనీయాంశంతో సౌలు, యోనాతానులను గూర్చిన విలాప గీతాన్ని దావీదు రచించాడు.

సౌలుయొక్క మరణం దావీదుకు రెండు ద్వారాలను తెరిచింది. మొదటిగా, స్వతంత్రుడై ఉండడానికి అతనికి ద్వారం తెరువబడింది. సౌలు మరణంతో, పారిపోవడం నిలిపివేసి అతడు తన జనుల వద్దకు తిరిగి వెళ్లవచ్చు. రెండవది, రాజ నగరుకు అది ద్వారం తెరిచింది. దావీదు యిప్పుడు రాజు కావచ్చు. పాత దావీదు అయితే, "దీనికి సందేహం లేదు దేవుడే దీనిని సాధ్యం చేశాడు" అంటూ నిస్సందేహంగా గృహోన్ముఖుడయ్యే వాడే. దూరదేశం వెళ్లి చావక బ్రతికిన దావీదైతే, "నా కొరకైన దేవుని చిత్తమేమైయుందో ముందు పరీక్షించి నిశ్చయం చేసికొంటా"నని అంటున్నాడు. అతడు పరారీలో ఉన్న కాలమందు దావీదు నేర్చుకున్న అతి ప్రాముఖ్యమైన పాఠమిది. అది దేవుని ప్రజల నాయకుడుగా ఉండునట్లు అతన్ని సిద్ధపరచింది.

> ఇది జరిగిన తరువాత – యూదా పట్టణములలోనికి నేను పోదునా అని దావీదు యెహోవాయొద్ద విచారణ చేయగా–పోవచ్చునని యెహోవా అతనికి సెలవిచ్చెను. – నేను పోవలసిన స్థలమేదని దావీదు మనవి చేయగా – హెబ్రోనుకు పొమ్మని ఆయన సెలవిచ్చెను. కాబట్టి యెజ్రెయేలీయురాలగు అహీనోయము, కర్మెలీయుడగు నాబాలునకు

> భార్యయైన అబీగయీలు అను తన యిద్దరు భార్యలను వెంటబెట్టుకొని దావీదు అక్కడికి పోయెను. మరియు దావీదు తనయొద్దనున్న వారినందరిని వారి వారి యింటివారిని తోడుకొని వచ్చెను; వీరు హెబ్రోను గ్రామములలో కాపురముండిరి (2 సమూ. 2:1-3).

దావీదు తన కానుకను హెబ్రోనులోని పెద్దలకు పంపాడు (1 సమూ. 30:31), తన రాజ నగరుగా కాబోయే తొలి పట్టణం అదే. దావీదు ఎట్టకేలకు యిల్లు చేరుకున్నాడు, దూర దేశంనుండి ఇంటికి వచ్చాడు.

## ముగింపు

తప్పిపోయిన కుమారుడు తిరిగి వచ్చాడు, తండ్రి యింటిలోనికి తిరిగి చేర్చుకొనబడ్డాడు. దావీదు యింటికి తిరిగి వచ్చాడు - దేవుడతనిని రాజుగా చేశాడు (2 సమూ. 2:4). నీవు ఒకవేళ దూర దేశం ప్రయాణమై పోయి ఉన్నట్టయితే, నేడు నీవు తిరిగి వచ్చేలా వారి ఉదాహరణలు నిన్ను ప్రోత్సహించుతాయని నిరీక్షిస్తున్నా.

దూర దేశంనుండి తిరిగి వచ్చే దానికంటే శ్రేష్ఠమైన ఒక సంగతి ఏమంటే-అసలు ఎన్నడు అక్కడికి వెళ్లకుండ ఉండడమే. అంత దూరదేశం వెళ్లాలని నీవు శోధింప బడినట్టయితే, తప్పిపోయిన కుమారునికిని, దావీదుకును ఏమి సంభవించిందో అదే తిరిగి ఆలోచించేలా నిన్ను చేస్తుంది. వారు వచ్చినట్టు అందరూ రాకపోవచ్చు. ఆ దేశము తిరిగి రాని మృత దేహాలతో నింపబడియుంటుంది.

దూరదేశంలో ఉన్నట్టు నిన్ను నీవు కనుగొన్నట్టయితే, “మారుమనస్సు పొంది, ప్రార్థించి, దేవుని ప్రజల యొద్దకు తిరిగి రమ్మని” దేవుని వాక్యము నీకు తెలుపుతోంది (అపొ. 8:22; యాకోబు 5:16). చేయగలిగినప్పుడే నీవు దాన్ని చేయాలి! మరోవైపు, దూరదేశం వెళ్లాలనే భావన నిన్ను రెచ్చగొట్టుతూ ఉంటే, ఆగి నీ కార్యముల ప్రతిఫలం ఏమైయుంటుందో దాన్ని గూర్చి ఆలోచించు. అప్పుడు, వెళ్లకు!

---

## ప్రసంగపు నోట్సు

“శత్రు భూ భాగంలో జీవించడం” అనే పాఠాన్ని ఈ మెటీరియల్‌ను ఉపయోగించి అత్యవసరమైన పాఠాన్ని ఉపదేశించవచ్చు. దావీదు శత్రు భూభాగంలోనికి వెళ్లాడు; మనం “ఈ యుగ సంబంధమైన దేవత” తన ప్రభావమును కనుపరచు వాతావరణములో మనం జన్మించాం (2 కొరింథీ. 4:4). “ఈ లోకం మన గృహం కాదని మనం గ్రహించాలి; మనం దీనిలోగుండా వెళ్లుతున్నవారమే” (హెబ్రీ. 11:9, 10; 1 పేతురు 2:11; మొదలైనవి). “మరణంవరకు” మనం అపవాదితో పోరాడవలసినవారమై ఉన్నాం (ఎఫెసీ. 6:11, 12తో పోల్చి చూడు). శత్రు భూభాగంలో మనం చావక ఎలా బ్రతకాలో దావీదు జీవితంలోని ఈ కాలము మనకు సూచిస్తోంది. (1) మనం శత్రు భూభాగంలో ఉన్న సంగతి ఎన్నడూ సందేహించవద్దు. (2) స్థిరమైన మద్దతు యిచ్చే గుంపుతో చుట్టబడి ఉండేటట్టు అది నీకు సహాయపడుతుంది. (3) సంగతులు విషమించినప్పుడు సహితము,

అవి యింకా చెడ్డగా మారే అవకాశముందని జ్ఞాపకం చేసికో. (4) అంతరాయాలు కలుగుతాయి, కాని దేవుని మీద దృష్టి నిలుపు, మన జీవితాల కొరకు ఆయన ఉద్దేశాలను గమనించు. (5) శ్రేష్ఠమైన రోజు ముందు ఉంది అని ఎన్నడు మరచిపోకు. (దావీదు సింహాసనాన్ని అధిష్టించాడు, మన కొరకు జీవ కిరీటం ఉంది)!

---

సూచనలు

[1]దావీదు ఫిలిష్తీయాలో జీవించిన కాలము, మొదట కన్పించినంత స్థిరంగా ఉండదు. 1 సమూ. 27:7లో అక్షరార్థంగా "దినాలు మరియు నాలుగు నెలలు" అని ఉంది. అది "ఒక సంవత్సరం నాలుగు మాసాలు" కావచ్చు. 7వ వచనంలో దావీదు సిక్లగులో జీవించిన కాలాన్ని సూచించవచ్చు. లేదా దావీదు సిక్లగుకు వెళ్లక ముందు గాతులో ఉన్న కాలం కూడా యిందులో చేర్చబడియుండవచ్చు. మనం NASB ఉపయోగిస్తున్నందున, దావీదు ఫిలిష్తీయాలో జీవించిన కాలం పదహారు నెలలుగా చెప్పడమయ్యింది. [2]ఫిలిష్తీయులను గూర్చి ఎక్కువ సమాచారం కొరకు "పిలిష్తీయులు" అనే పాఠాన్ని చూడు. [3]1 సమూ. 5:2. [4]1 సమూ. 31:10. [5]యెహోషువ 13:2నుండి. [6]1 సమూ. 13:5 గమనించు. [7]ఆ పట్టణాలు యూదా గోత్రపు స్వాస్థ్య భాగంలోనివి (యెహోషువ 13:3 పోల్చి చూడు). యూదా మూడు పట్టణాలను మరియు కొండ ప్రక్కన భూ భాగాన్ని పట్టుకోగలిగింది (న్యాయాధి. 1:18, 19), ఆ పట్టణ నివాసులను యూదా ఎన్నడు పారద్రోలింది గాని, ఫిలిష్తీయులు ఆక్రమించుకున్న స్థలాన్ని స్వాధీనపరచుకొన్నది గాని కాదు (న్యాయాధి. 1:19). త్వరలోనే వారి అయిదు పట్టణాలు ఫిలిష్తీయుల స్వాధీనంలోనికి వచ్చాయి (న్యాయాధి. 3:1నుండి). [8]న్యాయాధి. 10:6, 7; మొదలైనవి. [9]న్యాయాధి. 13:1. [10]న్యాయాధి. 16:4, 5 పోల్చి చూడు.

[11]1 సమూ. 5:1, 2 పోల్చి చూడు. మందసం ఫిలిష్తీయులకు ఎంత శ్రమ కలిగించిందంటే, వారు త్వరలోనే దానిని తమ దేశంలోనుండి తరలించేలా చేసింది (1 సమూ. 6). [12]1 సమూ. 10:5. [13]1 సమూ. 13:16–18. [14]తన ఆరు వందల మంది జనులకును వారి కుటుంబాలకును అవసరతలు తీర్చవలసిన అవసరం దావీదుకున్నట్టు చెప్పబడింది. ఈ బాధ్యత దావీదు మీద గొప్ప భారమే, ఒకవేళ యిది అతని మనస్సులోనికి ప్రవేశించి యుండవచ్చు. [15]Kenneth Barker, gen. ed., *The NIV Study Bible* (Grand Rapids, Mich.: Zondervan, 1985), 415. [16]1 సమూ. 28:2; 29:8లను కూడా గమనించు. [17]దావీదు, ఆకీషుల మధ్య ఒడంబడిక ఉన్నట్టు ఎక్కువ మంది వ్యాఖ్యాన కర్తలు తలంచుతారు: తాను దండెత్తి తెచ్చిన కొల్ల సొమ్ములో ఎంత కాలం దావీదు ఆకీషుకు భాగమిస్తూ ఉంటాడో అంతకాలం అతడు సిక్లగ్‌లో నివసింపవచ్చు. [18]ఇది "తమాషా గారడీ" యిందులో మానవతా శక్తులు ఉన్నాయని చెప్పుకొనదాలు ఏమీ ఉండవు. [19]"చెడు కాలాల్లో చావక ఎలా బ్రతికి యుండాలి" అనే పాఠం ట్రూత్ ఫర్ టుడే ఫిబ్రవరి ఆంగ్ల సంచికలో చూడు. [20]దావీదు ఎక్కడికి వెళ్లాడు, ఎవరి మీద పడ్డాడు అని సూచించడమే దాని ప్రాథమిక ఉద్దేశమై యుంటుంది (1 సమూ. 27:11 గమనించు),

[21]"నేటివరకును, సిక్లగు యూదా పరిపాలనకు చెందియున్నది" గనుక రచయిత ఎడిటోరియల్ కామెంట్ చేర్చాడు (1 సమూ. 27:6). ఈ కామెంట్ ఆది టెక్స్ట్‌లో భాగమై యున్నట్టయితే, పుస్తకంలో ఈ భాగము తరువాత కొన్ని సంవత్సరాలకు దాని ఫైనల్ రూపంలోనికి తెచ్చిందేమో. [22]సిక్లగు అనేది ఇశ్రాయేలుకు, ఫిలిష్తీయాకు మధ్య సరిహద్దు పట్టణం. ఇది ఒరిజినల్‌గా సుమయోను గోత్రానికి కేటాయించబడింది (యెహోషువ 19:5), కాని తరువాత అది యూదాలో భాగమైయింది (యెహోషువ 15:31). యూదానుండి ఫిలిష్తీయులు దాన్ని పట్టుకొన్నట్టుంది. [23]యెహోషువ 13:2 చూడు. యొర్దానుకు తూర్పున కనానులో నివసించిన గెషూరీయులతో వీరిని భావించకూడదు (2 సమూ. 15:8). [24]ఆది. 36:12, 16. [25]1 సమూ. 30లోని దండయాత్రను గూర్చి యిచ్చిన వివరాలనుండియు, లేఖనాల్లో తరువాత అమాలేకీయులను గూర్చి యివ్వబడిన రిఫరెన్సులనుండి యిది నిజమేనని స్పష్టపడుతుంది. రాజును తప్ప మిగిలిన అమాలేకీయులనందరిని సౌలు సంహరించి యుండినట్లయితే, వారు అధిక సంఖ్యాకులై ఎలా ఉంటారు (1 సమూ. 15:7–9)? సౌలు "షూరు" వరకు మాత్రమే వారిని చంపియుంటాడు (1 సమూ. 15:7). బహుశా ఆ ప్రజలలోని ఒక గుంపు వారికి సంబంధించిన ఆజ్ఞననే దేవుడు సౌలుకు యిచ్చాడు. [26]అమాలేకీయులు ఇశ్రాయేలీయులకు నిర్గమకాండంనుండి (నిర్గమ. 17:8–16) హిజ్కియా పరిపాలన వరకు శత్రువులుగా ఉన్నారు (1 దినవృ. 4:41, 43తో పోల్చి చూడు). [27]"నెగబ్" అని కూడా యిది

తర్జుమా చేయబడవచ్చు. [28]ఈ ప్రాంతం దక్షిణ భాగమై ఉన్నందున, "నెగవ్" "దక్షిణమునకు" అని అర్థం అయ్యింది. కొన్ని సార్లు "దక్షిణము" అని తర్జుమా చేయబడింది. [29]1 దినవృ. 2; సంఖ్యా. 13; యెహోషువ 14; 15. [30]న్యాయాధి. 1:16

[31]ఈ పాఠంలో, 1 సమూ. 28:3, 5–25ను చర్చించలేదు. ప్రభువు చిత్తమైతే, సౌలు మీదపడి వరుసలో మనం యిక్కడికి తిరిగి వస్తాం. [32]1 సమూ. 30:1 చూడు. [33]"హెబ్రీయులని" అనే పదం ఇశ్రాయేలీయులను సూచించడానికి ఉపయోగించబడింది. దీని నిజమైన భావం తర్కించబడింది. ఫిలిష్తీయుల నోళ్లలో ఆ పదం అపహాస్యంతో ఉపయోగించబడియుండవచ్చు. ఇశ్రాయేలీయులు "ఇశ్రాయేలీయులనే" పేరునే యిష్టపడతారు. అది దేవునితో వారి ఒడంబడికను తెలుపుతుంది.ఏమైనా వారు మాట్లాడే భాష – హెబ్రీ. [34]"దినాలు, సంవత్సరాలు" అనే ఒరిజినల్ టెక్స్ట్‌లో ఉన్నది సరియైన అర్థం యివ్వదు. ఇది అనేక సంవత్సరాలను సూచించవచ్చు, లేక కేవలం "ఒక్క సంవత్సరం కంటె ఎక్కువ" కావచ్చు. ఒక "సంవత్సరం నాలుగు నెలలకు" సరితూగుతుంది – NASB 1 సమూ. 27:7 తర్జుమా. NIVలో "సంవత్సరంకంటె ఎక్కువ" అనియూ, NEBలో "ఒక సంవత్సరం అంతకంటె ఎక్కువ" అనియూ ఉంది. [35]వారు ఆ పాటను యింకా పది సంవత్సరాల నుండి జ్ఞాపకముంచుకున్నారు. "దావీదు పదివేలు" (1 సమూ. 29:5). గత సందర్భంలో, యుద్ధం మధ్యలో ఫిలిష్తీ సైన్యంలో ఉన్న ఇశ్రాయేలీయుల వారికే వ్యతిరేకంగా తిరిగారు (1 సమూ. 14:21); అది మరలా సంభవించడానికి వారికి యిష్టంలేదు. సౌలుయొక్క దయను పొందడానికి దావీదు పక్షాలు మారవచ్చునని వారు తలంచారు. [36]ఆకీషు ఆశ్చర్యమైన మాటలతో, "యెహోవా జీవముతోడు" అని ప్రారంభించాడు (1 సమూ. 29:6) "యెహోవా" అనేది "దేవుని" పవిత్రమైన నామము. దావీదు దేవునితో ఆరంభించి, ఒకవేళ పరిస్థితిని ఆకీషు మృదువుగా చేయ ప్రయత్నిస్తున్నాడేమో. [37]"నీతోకూడ వచ్చిన నీ యజమానుని సేవకులును" అని 1 సమూ. 29:10లో కూడా ఆకీషు ఈలాటి స్పష్టంకాని పద ప్రయోగాన్నే చేశాడు. యజమానుడని అతడు తన్ను గూర్చి మాట్లాడుతున్నాడా? సిగ్లగులో దావీదుతో కలిసిన ఇశ్రాయేలీయులను గూర్చి మాట్లాడుతున్నట్టు కొందరు తలంచుతారు (1 దినవృ. 12:19–21). వారు సౌలుకు సేవకులుగా ఉన్నవారు. [38]"ఫిలిష్తీయులు యెజ్రెయేలుకు వెళ్లినట్టు" 1 సమూ. 29:11 గుర్తిస్తుంది. ఇశ్రాయేలీయులు శిబిరాలు వేసికొంది అక్కడే (29:1). ఇశ్రాయేలీయులు గిల్బోవ పర్వతము వద్దకు తిరిగి వచ్చినట్టున్నారు (1 సమూ. 31:1), సౌలు, యోనాతానులు చనిపోయింది అక్కడే (2 సమూ. 1:21ని కూడా చూడు). [39]ఆకీషు దావీదును "దేవుని దూత (లేక వర్తమానికుడు)"తో పోల్చాడు (1 సమూ. 29:9), అంటే దావీదు అన్ని విషయములలో నిందారహితుడు అన్నట్టు. [40]1 సమూ. 30:14, 16, 24. (క్రేతులోనుండి వచ్చిన) కెరేతీయులు ఫిలిష్తీయులకు స్నేహితులుగా ఉన్నారు (యెహెజ్కేలు 25:16; జెఫన్యా 2:5; మొదలైనవి). "కాలేబు యొక్క నెగెవ్" హెబ్రోనుకు దక్షిణ ప్రాంతమైయుండవచ్చు.

[41]సన్నగా, వీరు లావుగా సోమరిపోతుల్లా ఉండేవారు కాదు నీచంగా మనిషి చేతినికూడా తుంచివేయగల రేజర్‌వంటి వీపులుగల వాటిని గూర్చి ఆలోచించు. [42]2 సమూ. 23:13–17. [43]1 దినవృ. 12:1, 2, 20 కొందరు బెన్యామీను, మనష్షే గోత్రాల్లోనుండి ప్రత్యేకంగా సిక్లగులో ఉన్న దావీదు వద్దకు వచ్చినట్లు ప్రస్తావించుతోంది. ఆ అధ్యాయయంలో 22వ వచనం యిలా అంటుంది. "దావీదు దండు దేవుని సైన్యమువలె మహా సైన్యమగునట్లు ప్రతి దినమున అతనికి సహాయము చేయువారు అతనియొద్దకు వచ్చుచుండిరి." [44]యోనాతాను యుద్ధ భూమిలో తన ప్రాణంతో పోరాడుతున్నాడు. [45]ప్రతివానిని దావీదు చంపినట్టు కాక, అమాలేకీయులు దావీదు, అతని జనుల యొక్క కుటుంబాలలో ఎవరిని చంపలేనట్టు 1 సమూ. 30:2లో మనం చదువుతాం. అమోలేకీయులు దావీదు కుటుంబాలను, అతని జనులను ఎవ్వరినీ చంపకుండా తీసికెళ్లారు. అమాలేకీయులు స్త్రీలను తరువాత "మానభంగం" చేసే పథకంతో అలా చేసారు. ఈజిప్టులో పిల్లల్ని స్త్రీలు అమ్మదలచారు. అమాలేకీయులు వారిని తరువాత ఏమి చేయదలచుకున్నా, దేవుడు వారి ప్రాణాలను కాపాడినట్టు లేఖనం తెలుపుతుంది. [46]వారి ఆహార వస్తువులు సమృద్ధిగా ఉండడానికి గాను సిక్లగులో ఏదియు వదలిపెట్టబడలేదు. [47]వారిని కాపాడతానని దావీదు వాగ్దానం చేసిన తరువాతది యిది. [48]1 సమూ. 30:17లో తర్జుమా చేయబడిన "సందజాము" అనేది "సూర్యోదయానికి గాని," "సూర్యాస్తమయానికిగాని" సంబంధించింది కాదు. యూదుల దినం సూర్యోదయంతో ఆరంభమౌతుంది, దావీదు సూర్యోదయంనుండి సూర్యాస్తమయంవరకు యుద్ధం చేశాడు. అంటే అది "మరు దినంవరకు." [49](1) ఆరు వందల మంది పురుషుల భార్యలను పిల్లలను కంట్రోలు చేయగలిగారంటే, ఆ సైన్యం వేలల్లో ఉంటుంది. (2) వారు ఆ దేశమంతట విస్తరించారు (1 సమూ. 30:16), (3) తప్పించుకొని వెళ్లిన నాల్గు వందల మంది (1 సమూ. 30:17) కేవలం వారిలో కొంత భాగం మాత్రమే. [50]ఇశ్రాయేలు చుట్టునున్న రాజ్యాలలో యిది దావీదుయొక్క తొలి విజయం కావచ్చు. దావీదు ఈ దేశాలన్నిటిని లోబరచినవాడే; మన వరుసలో వీటిని చూడబోతాం.

[51]సంఖ్యా. 31:27 వెనుకనున్న వారికి కూడా కొల్ల గొట్టిన సొమ్ములో భాగమియ్యవలెనని ఆజ్ఞాపించినా (యెహోషువ 22:8 కూడా చూడు), దావీదు సైన్యంలో కొందరు 200 తమ కుటుంబాలను మాత్రమే పునరుద్ధరించదలచారు. దావీదు

ఆ చట్టాన్ని తిరిగి చెప్పి దాన్ని శాశ్వతమైనదిగా రూపొందించాడు (1 సమూ. 30:25). ఆ విధంగా ఒక సమాంతరమైన న్యాయాన్ని 30:24లో మనం దేవుని కొరకు ఏకొంచమైనా చేసేవారిని ప్రోత్సహించడానికి తగిన పెద్ద పాఠాన్ని చూస్తాం. [52]1 సమూ. 30:26–31ల్లో చెప్పబడిన స్థలాలను కొన్ని నేడు కనుగొనవచ్చు; కొన్నింటిని గుర్తించలేం. ఉన్న పేర్లకు, "దావీదును అతని జనులును సంచరించిన స్థలములన్నిటిలో" అనే మాటలు చేర్చాలి (31 వ.), అంటే, దావీదు పారిపోయిన దినాల్లో ఉన్న స్థలాలన్నీ. ఇలా కానుకలను పంపడంలో దావీదు పలు విషయాలను సాధించాడు: గత పది ఏళ్లుగా తన్ను కాపాడినవారికి వందనాలు తెలిపాడు. అనేకులతో సంబంధాలను కుదుర్చుకున్నాడు వారి శత్రువులు "యెహోవా యొక్క శత్రువులని" అతడు నొక్కి చెప్పాడు (26 వ.), వారే తన శత్రువులు కూడా (26 వ.). ఇవన్నీ దావీదును సింహాసనానికి తెచ్చుటలో దేవుని కరుణాహస్తం ఉంది. [53]హెబ్రీ. 6:4–6; 10:23–31; మొదలగునవి. [54]1, 2 సమూయేలు గ్రంథాలు మొదట్లో ఒకే గ్రంథం. 2 సమూయేలు–దావీదు కథను కొనసాగిస్తుంది. [55]అమాలేకీయుడు ఉత్తరంనుండి వచ్చినందున, తన ప్రజలతో దావీదు యిటీవల చేసిన యుద్ధాన్ని గూర్చి యెరిగి యుండక పోవచ్చు. [56]రాజు గాయపడిన పిమ్మట అతని విన్నపము మేరకు అమాలేకీయుడు రాజును సంహరించినట్టు చెప్పుకొన్నాడు. దావీదు యొద్దనుండి ఏదేని బహుమానాన్ని ఆపేక్షించి అతడు అబద్ధమాడియుండవచ్చు. 1 సమూ. 31:4లో సౌలు తన్ను తాను చంపుకొన్నట్టు చెప్తుతుంది. యెహోవా యొక్క అభిషిక్తుని చంపినందుకు దావీదు అతని సంహరించాడు. గనుక ఆ అమాలేకీయుని యొక్క అబద్ధం దీవెన కాక, అతనికి మరణం తెస్తుంది. [57]"యోనాతాను: నిజమైన స్నేహితుడు," "హృదయం ప్రతీకారం కొరకు కోరుతున్నప్పుడు" అనే పాఠాలను ఫిబ్రవరి ఆంగ్ల సంచికలో చూడు.